

నవతెలంగాణ

కరీంనగర్

మంగళవారం | నవంబర్ 07, 2023 | www.navatelangana.com

అభివృద్ధి చేశాను.. ప్రజలు ఆదరిస్తారు..

నియోజకవర్గ అభివృద్ధికి తపించాను.. పనులూ చేశాను...



- మెడికల్‌కాలేజీ సహా రూ.వందల కోట్లతో ప్రజలకు మౌలికసదుపాయాలు కల్పించాను
- ఉద్యమ నేపథ్యం నుంచి వచ్చా.. ప్రజల కష్టాలేంటో తెలిసినోణ్ణి..
- ఏ సమస్య వచ్చినా.. క్షణాల్లో అందుబాటులో ఉండే వ్యక్తిగా గుర్తింపు
- నేను చేసిన అభివృద్ధిని చూసే.. మళ్లీప్రజలు నన్ను ఆదరిస్తారు..
- బీఆర్‌ఎస్ రామగుండం అభ్యర్థి కోరుకంటి చందర్

తెలంగాణ ఉద్యమ నేపథ్యం నుంచే వచ్చాను. ఇక్కడి ప్రజల కష్టాలు, బాధలు పూర్తిగా తెలిసినవాణ్ణి. ఉద్యమనాయకుని నుంచి ప్రజాక్షేత్రంలోకి వచ్చిన నాటి నుంచి ఏనాడూ నియోజకవర్గాన్ని వీడలేదు. ఎమ్మెల్యేగా ప్రజలు ఆదరిస్తే ఈ ఐదేండ్లలో ఊహించిన అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేశాను. రామగుండంకు మెడికల్‌కాలేజీ తీసుకురాగలిగాను. రూ.వందల కోట్ల నిధులతో ప్రజల మౌలిక సదుపాయాలు మెరుగుపర్చాను. ప్రతిగడపకూ సర్కారు సం'క్షేమాన్ని' అందించగలిగాను. ఏ సమస్య వచ్చినా.. క్షణాల్లో అందుబాటులో నేతగా ప్రజల్లో గుర్తింపు ఉంది. జనం మధ్యనేగాకుండా వారి మనసులోకూడా చోటు సంపాదించుకున్నాను. అందుకే ఈసారి ఎన్నికల్లో 'నా గెలుపు నల్లేరు మీద నడకే!' అంటూ ధీమా వ్యక్తం చేస్తున్న బీఆర్‌ఎస్ రామగుండం అభ్యర్థి కోరుకంటి చందర్‌తో 'నవతెలంగాణ' ప్రత్యేక ఇంటర్వ్యూ...

నవతెలంగాణ - కరీంనగర్ ప్రాంతీయ ప్రతినిధి / గోదావరిఖని

నవతెలంగాణ : ఎమ్మెల్యే కావాలనుకోవడం వెనుక బలమైన కారణాలేంటి?

కోరుకంటి : మాది గోదావరిఖని. చుట్టూతా సింగరేణి, ఎన్టిపిసి, ఆర్.ఎఫ్.సి.ఎల్, బసంత నగర్ కేసోరాం సిమెంట్, రామగుండం థర్మల్ పవర్ హౌజ్ వంటి పరిశ్రమలు. రామగుండానికి 'మాంచెస్టర్ ఆఫ్ ఇండియా' అన్న పేరేగానీ, రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ, తాగునీటి వంటి కనీస సౌకర్యాలు సరిగా లేవు. ఏదైనా జబ్బు చేస్తే ఆర్ఎంపీలే దిక్కు. గని ప్రమాదమో, రోడ్డు ప్రమాదమో జరిగితే వరంగల్‌కో, హైదరాబాద్‌కో వెళ్లాల్సిన పరిస్థితి ఉండేది. ప్రభుత్వ ప్రధానాస్పత్రి సుమారు 70 కిలోమీటర్ల దూరంలోని కరీంనగర్ జిల్లా కేంద్రంలో ఉండేది. ఈ వ్యవస్థ మారాలంటే.. ప్రజలకు కనీస సౌకర్యాలు సమకూర్చాలని సంకల్పించాను. అందుకే ఎమ్మెల్యే ఎన్నికల్లో పోటీ చేశా. తొలినాళ్లలో ఓడినప్పటికీ నాపై నమ్మకంతో 2018లో ఎమ్మెల్యేగా గెలిపించారు.

నవతెలంగాణ : ఎమ్మెల్యేగా మీరు ఇచ్చిన హామీలను నెరవేర్చారా?

కోరుకంటి : ఐదేండ్ల నా పదవీకాలంలో రెండేండ్లు కరోనా కాలమే గడిచింది. అయినప్పటకీ నియోజకవర్గంలో రూ.450కోట్ల నిధులతో రోడ్ల విస్తరణ, కొత్త రోడ్లు, డ్రైనేజీలు, స్ట్రీట్ లైటింగ్, ప్రధాన కూడళ్ళ సుందరీకరణ వంటి ఎన్నో అభివద్ధి పనులు చేపట్టాను. మున్సిపల్ కార్పొరేషన్‌లో విలీనమైన కుందనపల్లి, లింగాపూర్ గ్రామాలను నేను ఇచ్చిన హామీ మేరకు తిరిగి గ్రామపంచాయతీలుగా కొనసాగే విధంగా చేశాను. పోతనకాలనీ, యైటింక్లైన్ కాలనీ మధ్య బ్రిడ్జిని నిర్మించాను. బసంత్ నగర్-కుందనపల్లి వద్ద రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మిస్తున్నాం. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని కూడా మంజూరు ▸ మిగతా 2వ పేజీలో..

'పురుమల్ల'కే కరీంనగర్ 'హస్తం'

- సిరిసిల్లలో మళ్లీ కేకే మహేందర్‌రెడ్డికి అవకాశం
- తుదిజాబితా విడుదలతో పూర్తయిన 13సెగ్మెంట్ల కాంగ్రెస్ అభ్యర్థులు
- బీఆర్‌ఎస్ వర్సెస్ కాంగ్రెస్‌గానే సాగుతున్న పోటీ...

2లో...


పురుమల్ల శ్రీనివాస్


కేకే మహేందర్‌రెడ్డి

నాయకుడిగా కాదు సేవకుడిగా పని చేస్తా..

- మంథని అభివృద్ధే మా ధ్యేయం... భారీ మెజార్టీతో గెలుస్తా
- 'నవతెలంగాణ' ప్రత్యేక ఇంటర్వ్యూలో బీఆర్‌ఎస్ అభ్యర్థి పుట్ట మధూకర్



నవతెలంగాణ-మంథని

ఈ తొమ్మిదేళ్ల పాలనలో ఒకపక్క సంతప్తి, మరోపక్క కొంత అసంతప్తితో ఉన్న నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉన్నప్పటికీ నాయకుడిగా కాదు ప్రజా సేవకుడిగా పనిచేస్తా.. రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ సహకారంతో మంథని నియోజకవర్గం ముందుకు పోతుందని బీఆర్‌ఎస్ అభ్యర్థి పుట్ట మధూకర్ అన్నారు. 7లో...

కరీంనగర్‌కు ఏం చేశావో చెప్పి..
ఓట్లు అడుగు సంజయ్..

- విద్వేషపూరిత ప్రసంగాలు కాదు.. నువ్వు జనానికి ఏం చేస్తావో చెప్ప
- రూపాయి పని కూడా చేయలేకనే అసహనపు మాటలు
- ఇతరులను గెలిపించాలని హెలికాప్టర్ ఇస్తే...
- తన గెలుపునకు బీజేపీ నిషేధిత నాయకున్ని వెంటతెచ్చుకుండు
- రాజాసింగ్ రాసుకో.. బండి సంజయ్ మూడోసారి మూడో స్థానమే
- కరీంనగర్ బీఆర్ఎస్ అభ్యర్థి, మంత్రి గంగుల కమలాకర్ ఫైర్



మాట్లాడుతున్న మంత్రి గంగుల కమలాకర్

నవతెలంగాణ - కరీంనగర్ ప్రాంతీయ ప్రతినిధి

'కరీంనగర్ ప్రజలు ఎంపీగా గెలిపిస్తే ఇన్నేండ్లలో రూపాయి పని చేయలేదు. ప్రజలకు ఏం చేశాడో చెప్పకుండా.. కనీసం ఏం చేస్తాడో మాట్లాడకుండా.. ప్రజలను ఓట్లు ఎలా అడగాలో అర్థంకాక అసహనంతో బండి సంజయ్ విద్వేషపూరిత ప్రసంగాలు చేస్తున్నారు. బీజేపీ అభ్యర్థులను గెలిపించుకోవాలని ఆ పార్టీ ఆయనకు హెలికాప్టర్ ఇస్తే.. ఈయనేమో ఆ పార్టీ సస్పెండ్ చేసిన గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్‌ను వెంట తెచ్చుకున్నాడు. రాజాసింగ్ రాసుకో.. సంజయ్ ఘోరంగా ఓడిపోయి మూడోసారి కూడా మళ్లీ మూడోస్థానంలో ఉంటారు' అని కరీంనగర్ బీఆర్ఎస్ అభ్యర్థి, మంత్రి గంగుల కమలాకర్ వ్యాఖ్యానించారు. కరీంనగర్ జిల్లా కేంద్రంలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో గంగుల మాట్లాడారు. బీజేపీ పార్టీ నుంచి సస్పెండ్ చేస్తే ఆ పార్టీ పెద్దల కాళ్లు పట్టుకుని మళ్లీ టిక్కెట్ తెచ్చుకున్న రాజాసింగ్‌ను నామినేషన్ వేసేందుకు ఇక్కడి అభ్యర్థి సంజయ్ వెంట తీసుకురావడం సిగ్గుచేటన్నారు. రాజాసింగ్‌రాకతో సంజయ్ గ్రాఫ్ మరింత పడిపోయిందని అన్నారు. 'బలికా బకరా' అంటూ రేవంత్ రెడ్డిని తిడుతున్న బండి సంజయ్, రాజాసింగ్.. నిజానికి వీరిద్దరూ 'బలికా బకరాలే' అంటూ విమర్శించారు. సంజయ్ కు పోటీ చేయడం ఇష్టం లేకపోయినా ఆయనకు టికెటిచ్చి మరీ ఆ పార్టీ బరిలోకి దింపడం ఇందుకు అద్దం పడుతుందన్నారు. ఎంపీగా కరీంనగర్ ప్రజలకు రూపాయి పని చేయలేదని, ప్రశాంతంగా ఉన్న ఇక్కడి జనాలను స్వార్థ రాజకీయాల కోసం విద్వేషపూరిత ప్రసంగాలతో రెచ్చగొట్టవద్దని హితవు పలికారు. ఎంఐఎం కు మేయర్ పదవి ఇస్తారని 2018 లోనూ తమపై ప్రచారం చేశారని, ఈసారి కూడా అలాంటి ప్రచారం చేస్తున్నారని అన్నారు. వచ్చే కార్పొరేషన్ ఎన్నికల్లో కూడా గతంలాగానే 60 డివిజన్లలో పోటీ చేస్తామని, తమ పార్టీ నేతలే మేయర్, డిప్యూటీ మేయర్‌గా ఉంటారని స్పష్టం చేశారు. తమకు అభ్యర్థులు కరువని, ఎంఐఎంకు సీట్లు ఎలా ఇస్తామంటూ ప్రశ్నించారు. ఇక్కడి ప్రజలు శాంతియుత వాతావరణంలో చేసిన అభివృద్ధికే పట్టగడుతారని అన్నారు. అసలు ఓట్లు అడిగే పద్ధతి ఇది కాదని, ప్రజలకు ఏం చేశామో, ఏం చేయబోతున్నామో చెప్పి ఓట్లు అడగాలని కోరారు. ప్రజాస్వామ్యబద్దంగా పనులు చేసి తనను గెలిపించాలనిప్రజలను అడగాలే తప్ప మాటలతో రెచ్చగొట్టి కాదని అన్నారు. 'రాజాసింగ్ నీకు దమ్ముంటే ఇప్పుడు గెలువు. నువ్వు సమర్థుడివైతే ఎందుకు బీజేపీ నిన్ను పక్కన పెట్టింది.? డిసెంబర్ 3న వచ్చే ఫలితాల్లో బండి సంజయ్, రాజా సింగ్ ఘోరంగా ఓడిపోతున్నారు.' అంటూ జోస్యం చెప్పారు.

రేషన్‌కార్డులిచ్చేది కేంద్రమే..
అయినా రాష్ట్ర సర్కారు అదనంగా ఇచ్చింది...

తెలంగాణ వచ్చినప్పుడు 90 లక్షల రేషన్ కార్డులుంటే.. కేంద్రం ప్రభుత్వం కేవలం 54 లక్షల కార్డులకే అంగీకరించందని, మిగతా కార్డుదారులకు రాష్ట్రసర్కారు బియ్యం అందిస్తోందని మంత్రి గంగుల వివరించారు. ఇప్పటివరకు కేంద్రం ఒక్క కొత్త కార్డు కూడా మళ్ళీ మంజూరు చేయలేదన్నారు. రాష్ట్రంలో అదనంగా 35 లక్షల 67 వేల రేషన్ కార్డులకు తమ ప్రభుత్వమే ఖర్చు భరించి బియ్యం పంపిణీ చేస్తోందన్నారు. కేంద్రం ఇవ్వకపోయినా ప్రతియేటా కొత్తకార్డులు మంజూరు చేస్తోందని తెలిపారు. ఇలా రాష్ట్రం ఏర్పడ్డాక 6లక్షల పైచీలుకు కొత్తకార్డులు ఇచ్చిందని వివరించారు. సమావేశంలో నగర మేయర్ వై.సునిల్‌రావు, బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్ సహా పలువురు నాయకులు పాల్గొన్నారు.

అభివృద్ధి చేశాను.. ప్రజలు ఆదరిస్తారు..

(మొదటి పేజీ తరువాయి)

చేయించాను. సీనియర్ సివిల్ జడ్జి కోర్టు మంజూరు చేయించి, రూ.29 కోట్ల వ్యయంతో ఆరు కోర్టుల భవన సముదాయాన్ని నిర్మిస్తున్నాం. నిజాం కాలం నుండి పెండింగ్ లో ఉన్న పెద్దంపేట, రాయదండి ఖుర్దు కమ్మి భూములకు పట్టాలు ఇప్పించడంతోపాటు సింగరేణి, ప్రభుత్వ భూములలో ఇండ్లు నిర్మించుకున్న వారికి జీవో నెంబర్ 58, 59, 76 ద్వారా పట్టాలు ఇప్పించాను. లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా 27ఎల్, 17ఎల్ కాలువలతో వేలాది ఎకరాలకు నీళ్లు అందించడానికి ప్రణాళికలు చేశాం.

నవతెలంగాణ : మీ హయాంలోనే మెడికల్‌కాలేజీ రావడం పట్ల మీ స్పందన ఏంటి?

కోరుకంటి : అభివద్ధి అంటే రోడ్లు, డ్రైనేజీలు కాదని, ప్రజలకు అవసరమైన శాశ్వత ఉపాధి, సౌకర్యాల కల్పనని నా అభిప్రాయం. అందుకే ఇక్కడి పరిస్థితులను వివరించి, కేసీఆర్ గారిని ఒప్పించి, మెప్పించి, జిల్లా కేంద్రం కాకపోయినా మెడికల్ కళాశాలను మంజూరు చేయించాను. 21 ఎకరాల విస్తీర్ణంలో 500 కోట్లతో నిర్మితమైన మెడికల్ కళాశాల గత సంవత్సరమే ప్రారంభమైంది. అనుబంధంగా 330 పడకలతో ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిని జనరల్ ఆసుపత్రిగా అప్ గ్రేడ్ చేయడం జరిగింది. సిటీ స్కాన్, ఆక్సిజన్ కాన్సన్ట్రేటర్, ప్లేట్లెట్స్ సెపరేషన్ మిషన్, సి-ఆర్మ్ వంటి ఆధునిక యంత్రాలతో కార్పొరేట్ వైద్యాన్ని ఉచితంగా పేదలకు అందుబాటులోకి తీసుకువచ్చాము. సింగరేణి కార్మికుల పిల్లలకు మెడికల్ సీట్లలో ఐదు శాతం కోటా సాధించాను. కార్మికులకు స్పెషల్ వార్డ్ ఏర్పాటు చేయించాను. నియోజకవర్గంలోని నిరుద్యోగ యువతకు శాశ్వత ఉద్యోగ, ఉపాధి కల్పనకు ఐటీ పార్కు, ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటు కోసం



ఇటీవలనే ఐటీ, పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ చేతులమీదుగా శంకుస్థాపన కార్యక్రమాలు నిర్వహించుకున్నాం.

నవతెలంగాణ: తెలంగాణ ఉద్యమంలో మీ జ్ఞాపకాలేంటి?

కోరుకంటి : తెలంగాణ ఉద్యమ నేపథ్యంలో నేను 2001లో టీఆర్ఎస్ లో చేరాను. నా రాజకీయ గురువు కొప్పుల ఈశ్వర్. ఎమ్మెల్యే కావాలనో.. మరేదో పదవి కోసమో నేను అప్పుడు ప్రత్యక్ష రాజకీయాల్లోకి రాలేదు. స్వరాష్ట్ర స్వప్నం సాధన దిశగా ఉధృతంగా సాగుతున్న ఉద్యమ రోజులు ఇంకా మరువలేనివి.తెలంగాణ సిద్ధాంతకర్త జయశంకర్ సార్, కేసీఆర్ ఉద్యమపటిమకు ఆకర్షితుని అయ్యాను. నిరాహార దీక్ష ప్రత్యక్షంగానో.. పరోక్షంగానో చూసి స్ఫూర్తి పొందాను. మన నీళ్లు.. మన నిధులు.. మన నియామకాలు మనకే కావాలి. అందుకు ఏకైక మార్గం రాష్ట్ర సాధనే అన్న పిలుపును అందుకుని నా సహచరులతో కలిసి ఉద్యమంలో చురుకుగా పాల్గొన్నాను. రైల్ రోకో, రాస్తారోకో, మిలీనియం మార్చ్, సాగర హారం, సకల జనుల సమ్మె.. పేరు ఏదైనా చురుకుగా పాల్గొన్నాను. ఉద్యమంలో నాపై 125 కేసులూ అయ్యాయి. 45 రోజులు జైలు జీవితాన్ని కూడా గడిపాను. పోలీసులు పీడీ యాక్ట్ పెడతామని బెదిరించారు. లాఠీలకు, తూటాలకు, కేసులకు, జైళ్లకు దేనికి వెరవలేదు. సంక్రాంతి నాడు నా కుటుంబ సభ్యులందరితో గోదావరిఖనిచౌరస్తాలో నిరాహార దీక్ష కూడా చేపట్టాను. ఇలా చెప్పుకుంటూ పోతే ఉద్యమంలో నా ప్రస్థానం నన్ను ఈ స్థాయికి తీసుకొచ్చింది.

నవతెలంగాణ : ఇప్పుడు మళ్లీ పార్టీ మీకే టిక్కెట్ ఇచ్చింది? గెలుపుపట్ల మీకున్న ధీమా ఏంటి?

కోరుకంటి : ప్రభుత్వం తీసుకొచ్చిన ప్రతి సంక్షేమాన్ని' ప్రతి ఇంటికీ అర్హులైన లబ్ధిదారులకు అందించగలిగాను.

ఆసరా, కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్, ఎల్‌ఓసి, సిఎంఆర్‌ఎఫ్, కేసీఆర్ కిట్ ఇలా చెప్పుకుంటూ పోతే అనేక పథకాలు నియోజకవర్గంలో దాదాపు 60 వేల కుటుంబాలకు అందించగలిగాను. నియోజకవర్గంలో నేను చేపట్టిన శాశ్వత నిర్మాణాలు, అభివద్ధితోపాటు మా పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్ ఇటీవల గోదావరిఖనికి వచ్చిన సందర్భంగా నన్ను భారీ మెజారిటీతో గెలిపిస్తే రామగుండం నియోజకవర్గాన్ని దత్తత తీసుకుంటానని హామీ కూడా ఇచ్చారు. ఇక ముఖ్యమంత్రి కేసీఆర్, నా నియోజకవర్గ ప్రజల ఆశీస్సులు, అండదండలు మెండుగా ఉన్న నేను గెలవడం నల్లేరు మీద నడకగానే ఉంటుంది. రాబోయే రోజుల్లో ముంపు ప్రాంతాలలో వరద నివారణ కోసం గోదావరి నదికి కరకట్ట నిర్మాణం, మెడికల్ కళాశాలకు అనుబంధంగా నర్సింగ్ కళాశాల, మహిళా పోలీస్ స్టేషన్, మైనింగ్ పాలిటెక్నిక్ కాలేజీ, సింగరేణి ఆధారిత స్మాల్ స్కేల్ ఇండస్ట్రీస్ ఏర్పాటుకు కృషి చేస్తాను.

'పురుమల్ల'కే 'హస్తం'

- సిరిసిల్లలో మళ్లీ కేకే మహేందర్‌రెడ్డికి అవకాశం
- తుదిజాబితా విడుదలతో పూర్తయిన 13సెగ్మెంట్ల కాంగ్రెస్ అభ్యర్థులు
- బీఆర్ఎస్ వర్సెస్ కాంగ్రెస్‌గానే సాగుతున్న పోటీ

నవతెలంగాణ - కరీంనగర్ ప్రాంతీయ ప్రతినిధి

ఇన్ని రోజులు ఉత్కంఠగా ఎదురుచూస్తున్న కాంగ్రెస్ కరీంనగర్ అభ్యర్థి ఎవరనేది తేలిపోయింది. అందరూ అనుకున్నట్టుగానే బొమ్మకల్ సర్పంచ్ పురుమల్ల శ్రీనివాస్‌కే 'హస్తం' అందించిన అధిష్టానం ఆయనను అభ్యర్థిగా ప్రకటించింది. మరోవైపు సిరిసిల్ల అభ్యర్థిగా మరోమారు సీనియర్ నాయకుడు కేకే మహేందర్‌రెడ్డి పేరునే ఖరారు చేస్తూ కాంగ్రెస్ అధిష్టానం సోమవారం తుదిజాబితాను విడుదల చేసింది. ఎట్టకేలకు ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని 13స్థానాల్లో అభ్యర్థులందరినీ ప్రకటించడంతో 'హస్తం' శ్రేణులు ఊపిరిపీల్చుకున్నాయి. ఈ నేపథ్యంలో ఉమ్మడి జిల్లా స్థానాల్లో మెజార్టీ బీఆర్ఎస్ వర్సెస్ కాంగ్రెస్‌గానే పోరు ఉండనుండగా.. అందులో దాదాపు సగానికిపైగా టఫ్ ఫైట్ సాగే అవకాశాలు మెండుగా కనిపిస్తున్నాయి.

చివరి నిమిషంలో 'పురుమల్ల'కే అవకాశం....

కరీంనగర్ నియోజకవర్గంలో ప్రధాన పార్టీలు బీసీ సామాజిక వర్గానికి చెందిన నేతలనే రంగంలోకి దింపిన నేపథ్యంలో కాంగ్రెస్ కూడా బీసీ నేతకే టిక్కెట్ ఇచ్చేందుకు మొగ్గుచూపుంది. అందులోనూ బొమ్మకల్ సర్పంచ్‌గా రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించిన పురుమల్ల శ్రీనివాస్ అనతికాలంలోనే కరీంనగర్ నియోజకవర్గ రాజకీయాల్లో కేంద్ర బిందువుగా మారారు. రూరల్ ప్రాంతాల్లో పట్టున్న ఆయనకు మైనారిటీ ఓటు బ్యాంకు కూడా కొంత వెనుకుందనే అభిప్రాయమూ రాజకీయవర్గాల్లో ఉంది. దీంతో శ్రీనివాస్ అభ్యర్థిత్వాన్ని ఖరారు చేసినట్టు తెలుస్తోంది. చాలా కాలంగా అధికారపార్టీ బీఆర్ఎస్‌లోనే ఉన్న పురుమల్ల ఆ పార్టీలో పొసగక చాలా కాలంగా కేసులు, ఇతరాత్ర విషయాల్లో బీఆర్ఎస్‌ను విబేధించి ఆ పార్టీని వీడారు. టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డిని కలిసి కరీంనగర్ అసెంబ్లీ టిక్కెట్‌తనకు కేటాయించాలని కోరారు. సీనియర్ నేతగా, సర్పంచ్‌గా నియోజకవర్గం పరిధిలో మంచి సంబంధాలు కలిగి ఉన్నాడన్న సర్వేతో కాంగ్రెస్ అధిష్టానం శ్రీనివాస్‌కు అవకాశం ఇచ్చినట్టు తెలుస్తోంది.

సిరిసిల్లలో కేకే మహేందర్‌రెడ్డికే మళ్లీ అవకాశం...

సిరిసిల్ల నియోజకవర్గం నుంచి స్వతంత్ర అభ్యర్థిగా 2009లో పోటీ చేసిన కేకే మహేందర్‌రెడ్డి కేవలం 171 ఓట్ల స్వల్ప తేడాతో ఓడిపోయారు. బీఆర్ఎస్ అభ్యర్థి కేటీఆర్‌పై అతి తక్కువ ఓట్లతో ఓడిపోయిన మహేందర్‌రెడ్డి అప్పటి నుంచి ఇదే నియోజకవర్గం నుంచి విజయాన్ని అందుకోవాలని ప్రయత్నిస్తూనే ఉన్నారు. 2010లో జరిగిన ఉప ఎన్నికల్లో పోటీ చేసిన కేకే మహేందర్‌రెడ్డి 2018 ఎన్నికల్లో కూడా తన అదష్టాన్ని పరీక్షించుకున్నారు. అయినప్పటికీ ఓటమి తప్పలేదు. తాజా ఎన్నికల్లో పోటీ చేసేందుకు సిద్ధం అవగా, ఆయనకు ఇతరులెవరూ పోటీగా లేకపోయినా కాంగ్రెస్ అధిష్టానం తొలి, మలివిడత జాబితాలో పేరు ప్రకటించలేదు. తీరా అక్కడ కేకే మహేందర్‌రెడ్డి తప్ప మరో వ్యక్తిని నిలబెట్టలేని పరిస్థితుల్లో మళ్లీ 'కేకే'కు టిక్కెట్ కన్ఫార్మ్ చేస్తూ తుదిజాబితాలో పేరు ప్రకటించడం గమనార్హం.

కరీంనగర్ బీఆర్ఎస్ యువగర్జన

నవతెలంగాణ-కరీంనగర్

కరీంనగర్‌లోని జ్యోతిబాపూలే గ్రౌండ్‌లో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో జరిగిన యువ గర్జన సభకు కొత్త జయపాల్ రెడ్డి తన అనుచర వర్గంతో భారీ ర్యాలీగా వెళ్లి మంత్రి గంగులకు మద్దతు తెలిపారు. సుమారు 200 పైచిలుకు మంది కాంగ్రెస్ కార్యకర్తలు జయపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ఎస్‌లో చేరారు. మంత్రి గంగుల కమలాకర్ వారందరికీ గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మంత్రి గంగుల మాట్లాడుతూ..కొత్త జయపాల్‌రెడ్డికి మాట ఇచ్చిన ప్రకారం తమ ప్రభుత్వం తిరిగి అధికారంలోకి రాగానే ఎమ్మెల్సీ పదవి లేదా రెడ్డి కార్పొరేషన్ చైర్మెన్ పదవి ఇస్తామని హామీనిచ్చారు. కాంగ్రెస్ మాదిరిగా తాము మోసం చేయబోమని జయల్‌పాల్ రెడ్డికి భరోసా ఇచ్చారు. జయపాల్‌రెడ్డి రాకతో తమ పార్టీకి కొండంత బలం వచ్చిందని అన్నారు. జయపాల్ రెడ్డి వల్ల కరీంనగర్, చొప్పదండి, మానకొండూర్ నియోజకవర్గాల్లో తమ పార్టీకి అదనపు బలం చేకూరిందన్నారు. జయపాల్‌రెడ్డి అండతో ఆ మూడు నియోజకవర్గాల్లో బీఆర్ఎస్ జెండా ఎగురవేస్తామని గంగుల కమలాకర్ విశ్వాసం వ్యక్తం చేశారు. అలాగే కరీంనగర్‌ను అన్ని



రంగాల్లో అభివృద్ధి చేసిన గంగుల కమలాకర్ కార్యకర్తలను కూడా కంటికి రెప్పలా చూసుకుంటారని జయపాల్ రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు.

నవతెలంగాణ 3
కరీంనగర్
మంగళవారం | నవంబర్ 07, 2023 | www.navatelangana.com

హుజురాబాద్ నియోజకవర్గంలో జంప్‌జిలానీలు

- కండువాల రంగులు మారుతున్నాయి
- 24 గంటల్లోపే సొంత గూటికి ఎంపీపీ
- బుజ్జగింపుల పర్వం ప్రారంభం

నవతెలంగాణ - జమ్మికుంట

కమలాపూర్ నియోజకవర్గంలో 2004 సంవత్సరంలో బీఆర్ఎస్ పార్టీ నుండి పోటీ చేసి గెలిచిన ఎమ్మెల్యే ఈటల రాజేందర్ బీఆర్ఎస్ పార్టీకి, పాత కమలాపూర్ నియోజకవర్గం పునర్విభజన తర్వాత హుజురాబాద్ నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీకి కంచుకోటగా ఉంది. 2021లో బీఆర్ఎస్ పార్టీకి ఈటల రాజేందర్ రాజీనామా చేసి బీజేపీ నుండి పోటీ చేసినప్పుడు బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థిగా గెల్లు శ్రీనివాస్ యాదవ్ పోటీ చేయగా 83వేల ఓట్లు వచ్చాయి. ఆ తర్వాత నియోజకవర్గ ఇన్‌చార్జిగా ఎమ్మెల్సీ ప్రభుత్వ విప్ పాడి కౌశిక్‌రెడ్డిని పార్టీ నియమించింది. 2023 అసెంబ్లీ సాధారణ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థిగా పాడి కౌశిక్‌రెడ్డికి బీఫామ్ ఇచ్చింది. ఈ నెల 30న ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో నియోజకవర్గంలోని కమలాపూర్, హుజురాబాద్, జమ్మికుంట, వీణవంక, ఇల్లంతకుంట మండలాలకు చెందిన కొంతమంది బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ప్రభుత్వ విప్ పాడి కౌశిక్‌రెడ్డి ఒంటెద్దు పోకడ వల్లనే పార్టీ మారినట్టు వారు ఆరోపించారు. మరి కొంతమంది బీఆర్ఎస్ పార్టీ వీడెందుకు ప్రయత్నాలు చేస్తున్నారని సమాచారం.

24 గంటల్లోపు సొంత గూటికి ఎంపీపీ

ఈ నెల 5న జమ్మికుంట ఎంపీపీ దొడ్డే మమత ప్రభుత్వ విప్ పాడి కౌశిక్‌రెడ్డి తీరు నచ్చకనే బీఆర్ఎస్ పార్టీని వీడి కాంగ్రెస్ పార్టీలో ఆ పార్టీ నియోజకవర్గ అభ్యర్థి వొడితల ప్రణవ్ బాబు సమక్షంలో చేరినట్టు ప్రకటించారు. అదే రోజు రాత్రి ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్ కుమార్ సమక్షంలో తిరిగి గులాబీ కండువను కప్పుకున్నారు. 24 గంటలు గడవకుండానే మళ్లీ టీఆర్ఎస్ పార్టీలో చేరడంపై మండలంలో చర్చ జరుగుతోంది.

బీఆర్ఎస్ నుండి కాంగ్రెస్ లోకి చేరికలు

మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ తుమ్మేటి సమ్మిరెడ్డి, జమ్మికుంట మాజీ జెడ్పిటిసి అరికాల వీరేశలింగం, బీఆర్ఎస్వీ, బీఆర్ఎస్‌వై నాయకులు పార్లపల్లి నాగరాజు, అన్నం ప్రవీణ్, సీనియర్ నాయకులు మైస మహేందర్, వీణవంక మండలానికి చెందిన రెడ్డి ఐక్య వేదిక నాయకులు రాజిరెడ్డి, కళాకారుల సంఘం అధ్యక్షుడు విష్ణుదాస్ గోపాలరాజు, లక్ష్మాజీపల్లి మాజీ సర్పంచ్ బండి మల్లయ్య నాయకులు రవీందర్ రెడ్డి, తిరుపతిరెడ్డి, కమలాపూర్ మండలం ఉప్పల్ మేజర్ గ్రామపంచాయతీ నుండి సుమారు 600 మంది జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని కొత్తపెల్లి గ్రామం నుండి సుమారు 500 మంది మోత్కులగూడెం నుండి 50 మంది ఇలా పలు గ్రామాల నుండి కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఉద్యమకారుడు జెడ్పిటిసి డాక్టర్ శ్రీరామ్ శ్యామ్ ప్రభుత్వ విప్ కౌశిక్‌రెడ్డిపై తీవ్రమైన ఆరోపణలు చేసి బీజేపీలో చేరారు.

బుజ్జగింపుల పర్వం ప్రారంభం

ఇదే బాటలో మరి కొంతమంది నియోజకవర్గం నుండి కాంగ్రెస్‌లోకి వలస వెళ్లడానికి ప్రయత్నాలు చేస్తున్నారనే సమాచారంతో రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్ కుమార్ స్వయంగా రంగంలోకి దిగి ఒక్కొక్కరితో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకొని, ఇకముందు ఎలాంటి సమస్య రాకుండా చూస్తానని, ఎలాంటి సమస్య అయినా నేనే పరిష్కరిస్తానని భరోసా కల్పిస్తూ, పార్టీ మారకుండా చూస్తున్నట్టు సమాచారం. అందులో భాగంగానే జమ్మికుంట ఎంపీపీతో మాట్లాడి మళ్లీ బీఆర్ఎస్ పార్టీ కండువా కప్పినట్టు తెలుస్తోంది.

రాష్ట్ర సాధన కోసం పోరాడిన చరిత్రే నా ఆస్తి

కాంగ్రెస్ హుస్నాబాద్ అభ్యర్థి పొన్నం ప్రభాకర్

నవతెలంగాణ - సైదాపూర్



హుస్నాబాద్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి, మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్ సోమవారం ఎల్కతుర్తి మండలంలో ఎన్నికల ప్రచారం ముగించుకొని సైదాపూర్ మండలం వెళ్తున్న క్రమంలో హుజురాబాద్ శివారులో ఎన్నికల కోడ్ సిబ్బంది వాహనాలు తనిఖీ చేస్తుండగా కారును ఆపారు. అందులో ఉన్న సూట్ కేసును పోలీసు సిబ్బంది అదేమిటి అని ప్రశ్నించగా "ఇది నా ఆస్తి, చూపించ మంటారా" అని ఆ సూట్ కేసు ను పొన్నం ప్రభాకర్ తెరచి చూపించారు. అందులో పొన్నం ప్రభాకర్ తెలంగాణ ఉద్యమ చరిత్ర, పార్లమెంటులో పొన్నం ప్రభాకర్ పెప్పర్ స్ప్రే దాడికి గురైన ఫొటోలు, అప్పటి ప్రధాని మన్మోహన్ సింగ్ , పలువురు పార్లమెంటు సభ్యులతో, సోనియాగాంధితో సమావేశం అయిన చిత్రాలు కనిపించాయి. అక్కడున్న అధికారులతో ప్రభాకర్ మాట్లాడుతూ "నేను తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పోరాడిన చరిత్ర నే నా ఆస్తి అని గర్వంగా, తెలంగాణ బిడ్డగా రాష్ట్రం కోసం ప్రాణాలకు తెగించి పోరాడానని, మీరు తెలంగాణ బిడ్డలు అయితే, మీరు తీసిన వీడియోను మీడియాకు పంపండి అని, తెలంగాణ రాష్ట్రం కోసం ప్రాణాలకు తెగించిన ఉద్యమకారుల ఘనతను చాటండి అని అన్నారు. 'హుస్నాబాద్ నియోజకవర్గ ప్రజల ఆశీర్వాదం ఎల్లప్పుడూ నాకు ఉంటుందని' అన్నారు.

ఎస్సీ వర్గీకరణ బిల్లుకు చట్టబద్ధత కల్పించాలి

ఓబీసీ జనాభా లెక్కలు వెంటనే తేల్చాలి

తెలంగాణ ప్రజాసంఘాల జేఏసీ చైర్మన్ గజ్జెల కాంతం

నవతెలంగాణ - కరీంనగర్

పార్లమెంట్‌లో ఎస్సీ వర్గీకరణ బిల్లుకు చట్టబద్ధత వెంటనే కల్పించాలని తెలంగాణ ప్రజా సంఘాల జేఏసీ చైర్మన్ గజ్జెల కాంతం కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం నగరంలోని ఆయన నివాసంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడుతూ బీజేపీ అధికారంలోకి రాగానే వర్గీకరణ చేస్తానని మాట ఇచ్చి 9ఏండ్లు గడుస్తున్నా ఇంకా ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టక ఉభయ రాష్ట్రంలోని మాదిగలను బీజేపీ ప్రభుత్వం మోసం చేస్తుందని ఆరోపించారు. నేడు దేశ ప్రధాని మోడీ హైదరాబాద్‌లోని మాదిగ ఉపకులాల మహాసభకు హాజరవుతున్నారని ఈ సభకు వచ్చే ముందు వారికి ఇచ్చిన హామీ అమలు చేయాలన్నారు. దేశంలో ఓబీసీ జనాభా లెక్కలు తేల్చాలని డిమాండ్ చేశారు. దళిత, గిరిజన, మైనార్టీ, బీసీలను సామాజికంగా, ఆర్థికంగా రాజకీయంగా ఎదగడానికి మరో ఉద్యమం చేపడతానని తెలిపారు.

ప్రజలు మార్పు కోరుకుంటున్నారు..

మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ తుమ్మేటి

నవతెలంగాణ - జమ్మికుంట

రాష్ట్రవ్యాప్తంగా ప్రజలు మార్పు కోరుకుంటున్నారని.. కాంగ్రెస్ గాలి వీస్తోందని జమ్మికుంట వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ తుమ్మేటి సమ్మిరెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి ఆయన మాట్లాడారు. రెండు సంవత్సరాలుగా హుజురాబాద్‌లో రాజకీయం దిగజారి పోయిందన్నారు. సోనియా గాంధీ, రేవంత్‌రెడ్డి ప్రకటించిన ఆరు గ్యారంటీలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్తామన్నారు. రాజకీయ నేపథ్యం ఉన్న కుటుంబంలో పుట్టిన వ్యక్తి ప్రణవ్‌బాబు పోటీ చేయడంతో పార్టీకి మరింత బలంపెరిగిందని.. హుజురాబాద్‌లో తప్పకుండా కాంగ్రెస్ గెలుస్తుందన్నారు. ఆయనవెంట కాంగ్రెస్ నాయకులు సుంకరి రమేష్, ఎర్రబెల్లి రాజేశ్వరరావు, మొలుగూరి సదయ్య, యగ్గని శ్రీనివాస్, ఇమ్రాన్, ఎండీ.సలీం, మైస మహేందర్ ఉన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్ రెడ్డి

నవతెలంగాణ - కరీంనగర్



ప్రశంసాపత్రం అందిస్తున్న నరేందర్‌రెడ్డి

క్రీడల ద్వారా చాలా లాభాలు చేకూరుతాయని, ప్రత్యేకంగా మానసిక ఉల్లాసాన్ని పెంపొందిస్తాయని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్‌రెడ్డి అన్నారు. కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఇ-టెక్నో స్కూల్‌లో పాఠశాలకు చెందిన 9వతరగతి విద్యార్థి ఎ.స్నేహిత్ చంద్రారెడ్డి జాతీయ స్థాయి సెస్టో బాల్ పోటీలకు ఎంపికైన సందర్భంగా సోమవారం అభినందించారు. పుష్పగుచ్ఛాన్ని అర్హత పత్రాన్ని అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు.

ఆశీర్వదించండి అభివృద్ధి చేసి చూపిస్తా..

కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి వొడితల ప్రణవ్

నవతెలంగాణ - జమ్మికుంట



మాట్లాడుతున్న కాంగ్రెస్ అభ్యర్థి వొడితల ప్రణవ్‌బాబు

రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో ఒక్క అవకాశం ఇచ్చి ఆశీర్వదిస్తే హుజురాబాద్ నియోజకవర్గంలో అభివృద్ధి అంటే ఏమిటో చేసి చూపిస్తానని కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి వొడితల ప్రణవ్ అన్నారు. సోమవారం జమ్మికుంట మున్సిపాలిటీ కొత్తపల్లిలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సుమారు 500 మంది యువకులు, మహిళ లు కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారందరికీ పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ప్రణవ్ బాబు మాట్లాడారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు మొలుగూరి సదయ్య, పట్టణ అధ్యక్షుడు కసుబోజుల వెంకన్న, మండల అధ్యక్షుడు ఎర్రబెల్లి రాజేశ్వరరావు, పత్తి కృష్ణారెడ్డి, అరుకాల వీరేశలింగం, తుమ్మేటి సమ్మిరెడ్డి, ఇమ్రాన్, సజ్జు, సలీం, తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో స్వల్ప ప్రమాదం

సమావేశంలో స్వల్ప ప్రమాదం జరిగింది. కాంగ్రెస్ పార్టీలో చేరికలు సందర్భంగా మహిళల మధ్య నిలబడి ప్రణవ్ మాట్లాడుతుండగా కార్యకర్తలు టపాసులు కాలువడంతో, ఇద్దరు మహిళలకు, మీడియా వారికి గాయాలయ్యాయి.

కాంగ్రెస్ పార్టీలో చేరికలు



నవతెలంగాణ - జమ్మికుంట

జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని మోత్కులగూడెం గ్రామానికి చెందిన 50 మంది కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి వొడితల ప్రణవ్‌బాబు సమక్షంలో సోమవారం ఆ గ్రామ పోచమ్మ తల్లి దేవాలయం వద్ద చేరారు. ఈ సందర్భంగా వారందరికీ కాంగ్రెస్ పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. పోచమ్మ తల్లి బోనాలతో ప్రణవ్ బాబుకు మహిళలు స్వాగతం పలికారు.

కొనుగోలు కేంద్రాల పరిశీలన



నవతెలంగాణ - చొప్పదండి

చొప్పదండి మండలంలోని కొలిమికుంట, భూపాలపట్నం ఐకెపి వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను సోమవారం జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి శ్రీలత పరిశీలించారు. ధాన్యాన్ని నిల్వ ఉండకుండా ఎప్పటికప్పుడు కొనుగోలును వేగవంతం చేయాలన్నారు. అంతకుముందు భూపాలపట్నం, చిట్యాలపెల్లి, దేశాయిపేట, గుమ్లాపూర్, కాట్నపెల్లి, కొలిమికుంట, కోనేరుపల్లె, మంగళపల్లి, పెద్దకురుమ పల్లె, రేవెల్లి, సాంబయ్య పల్లె, వెదురు గట్ట గ్రామాలలో మహిళా గ్రామ ఐక్య సంఘాల నిర్వహించే వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. జిల్లా మార్కెటింగ్ డిపిఎం ప్రవీణ్, ఏపిఎం రాజేశం పాల్గొన్నారు.

నవతెలంగాణ 4

జగిత్యాల

మంగళవారం | 7 నవంబర్ 2023 | www.navatelangana.com

మూడు పార్టీల మధ్యే 'ప్రధాన' పోరు..?

- జగిత్యాల, కోరుట్లలో త్రిముఖ పోటీ..
- ధర్మపురిలో కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య పోరు..
- ఇతర పార్టీలు, ఇండిపెండెంట్‌ల పోటీ నామమాత్రమే...
- రసవత్తరంగా మారిన జగిత్యాల జిల్లా రాజకీయాలు



నవతెలంగాణ జగిత్యాలటౌన్

జగిత్యాల జిల్లాలో ప్రస్తుతం ప్రధాన పార్టీలైన బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీల మధ్యనే ప్రధానంగా పోటీ ఉంది. గతంలో కాంగ్రెస్, టీడీపీ, తరువాత కాంగ్రెస్, బీఆర్ఎస్ ఉండగా ప్రస్తుతం బలమైన అభ్యర్థులు బరిలో ఉండడంతో త్రిముఖ పోరు కనిపిస్తోంది. బీఎస్పీ, ఇతర పార్టీలు, ఇండిపెండెంట్‌లు నామమాత్రంగా పోటీ ఇచ్చే అవకాశం ఉంది. గతంలో కూడా పలు పార్టీలు, స్వతంత్ర అభ్యర్థులు పోటీ చేసినా టీడీపీ, కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల మధ్యనే ప్రధానమైన పోటీ ఉండేది. ఇప్పుడు జగిత్యాల, కోరుట్ల నియోజకవర్గల్లో ప్రధాన పార్టీలు బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ మధ్య హోరాహోరీ పోరు కనిపిస్తుండగా, ధర్మపురి నియోజకవర్గంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్యే పోటీ ఉంది.

జగిత్యాల నియోజకవర్గం..

జగిత్యాల నియోజకవర్గం జగిత్యాల అర్బన్, రూరల్, రాయికల్, సారంగాపూర్, బీర్పూర్ మండలాలతో ఏర్పాటయింది. ప్రస్తుత పరిస్థితులలో జగిత్యాల నియోజకవర్గంలో మూడు ప్రధాన పార్టీల మధ్యనే పోటీ నెలకొంది. ఇప్పటికే జగిత్యాల నియోజకవర్గంలో బీఆర్ఎస్, కాంగ్రెస్, బిజెపి అభ్యర్థులను ప్రకటించింది. వారు ఇప్పటికే ప్రచారాన్ని ప్రారంభించారు. బీఆర్ఎస్ నుంచి సంజయ్ కుమార్, కాంగ్రెస్ నుంచి సీనియర్ నాయకుడు ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి పోటీ చేస్తుండగా బిజెపి నుంచి బీసీ మహిళా అభ్యర్థి శ్రావణిని బరిలో ఉన్నారు. ఎవరికి వారే ప్రచారంలో తమదైన శైలిలో దూసుకుపోతున్నారు. ఇప్పటికే ఆయా పార్టీలలో చేరికలను ప్రోత్సహిస్తూ ముందుకు సాగుతున్నారు. గత రెండు అసెంబ్లీ ఎన్నికలలో సంజయ్ కుమార్, జీవన్ రెడ్డి ముఖాముఖి తలపడగా ఒకసారి జీవన్‌రెడ్డి మరోసారి సంజయ్ కుమార్ గెలుపొందారు. జగిత్యాల నియోజకవర్గంలో ఇప్పటివరకు వరుసగా ఏ అభ్యర్థి కూడా రెండవసారి ఎమ్మెల్యేగా గెలిచిన సందర్భాలు లేవని చరిత్ర స్పష్టం చేస్తుంది. మరి ఈసారి ఎన్నికలలో ఎవరు గెలుస్తారో ఆసక్తికరంగా మారింది. బీఆర్ఎస్ చేపట్టిన అభివృద్ధి పథకాలే తనను గెలిపిస్తాయని ప్రస్తుత ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ ధీమా వ్యక్తం చేస్తుండగా, కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారెంటీలతో పాటు ప్రజల మనిషిగా తాను ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని అదే నన్ను గెలిపిస్తుందని ప్రస్తుత పట్టభద్రుల ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. గత చరిత్రను పరిశీలిస్తే రెండు పార్టీల మధ్యనే పోటీ ప్రధానంగా ఉండేది. కానీ ఇప్పుడు ముక్కోణపు పోటీ ఏర్పడే అవకాశాలు స్పష్టంగా కనబడుతున్నాయి

కోరుట్ల నియోజకవర్గం...

2009లో నియోజకవర్గాల పునర్విభజనలో భాగంగా కోరుట్ల నియోజకవర్గం ఏర్పాటు అయింది. జిల్లాలో రెండు మున్సి పాలిటీలు గల ఏకైక నియోజకవర్గంగా కోరుట్లకు ప్రత్యేకత ఉంది. కోరుట్ల నియోజకవర్గంలో కోరుట్ల, మెట్‌పల్లి, మల్లాపూర్, ఇబ్రహీంపట్నం మండలాలు ఉన్నాయి. మూడు సార్లు జరిగిన ఎన్నికల్లో పసుపు పంట మద్దతు ధర అంశమే కీలకం కాగా, ప్రస్తుతం షుగర్ ఫ్యాక్టరీ పునరుద్ధరణ ప్రధాన ఎజెండాగా నిలిచింది. గల్ఫ్, బీడీ కార్మికులు కూడా అధికంగా గల నియోజకవర్గం కోరుట్ల. గతంలో ఈ నియోజకవర్గం నుంచి హేమాహేమీలు బరిలో నిలిచి గెలిచారు. వారిలో చెన్నమనేని విద్యాసాగర్‌రావు మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొందారు. అనంతరం కరీంనగర్ ఎంపీగా కూడా గెలిచి కేంద్ర హోంశాఖ సహాయ మంత్రిగా, మహారాష్ట్ర గవర్నర్‌గా ఉన్నత పదవులను అలంకరించారు. శికారి విశ్వనాథం మూడుసార్లు, కొమిరెడ్డి జ్యోతి, కోమిరెడ్డి రాములు ఒకసారి గెలుపొందగా జువ్వాడి రత్నాకర్ రావు ఒకసారి గెలిచి మంత్రిగా పనిచేశారు.

2009 నుంచి ఇప్పటివరకు నాలుగు సార్లు ఎన్నికలు జరగగా కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు గెలుపొందారు. కోరుట్ల నియోజకవర్గంలో కోరుట్ల, మెట్‌పల్లి మున్సిపాలిటీలుగా, రెవెన్యూ డివిజన్లుగా ఏర్పడ్డాయి. ఈసారి కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు తనయుడు కల్వకుంట్ల సంజయ్ బీఆర్ఎస్ తరపున పోటీలో నిలువగా, కాంగ్రెస్ నుంచి రత్నాకర్‌రావు కుమారుడు నర్సింగరావు బరిలో ఉన్నారు. బీజేపీ నుంచి ఎంపీ అరవింద్, బీఎస్పీ నుంచి నిశాంత్ కార్తికేయ పోటీలో ఉన్నారు. ఇక్కడ పద్మశాలి, ముస్లిం మైనారిటీ, ఎస్సీ ఓటర్లు ప్రభావితం చూపుతాయి.

ధర్మపురి నియోజకవర్గం..

ధర్మపురి ఎస్సీ నియోజకవర్గం 2009 పునర్విభజనలో భాగంగా ఏర్పాటయింది. ధర్మపురి నియోజకవర్గంలో ధర్మపురి, వెల్గటూరు, బుగ్గారం, ఎండపల్లి, గొల్లపల్లి, పెగడపల్లి మండలాలు ఉన్నాయి. 2009 నుంచి ఇప్పటి వరకు 2009, 2014, 2018లో సాధారణ ఎన్నికలు, 2010 సంవత్సరంలో ఉప ఎన్నిక జరగగా కొప్పుల ఈశ్వర్ గెలుపొందారు. ఇప్పటివరకు కొప్పుల ఈశ్వర్ ఆరుసార్లు గెలుపొంది రికార్డు సృష్టించారు. ఒకసారి చీఫ్ విప్ పదవి, ఆ తర్వాత గెలిచి మంత్రి అయ్యారు. అడ్లూరి లక్ష్మణ్ కుమార్ నాలుగు సార్లు పోటీ చేశారు. గత ఎన్నికల్లో స్వల్ప ఓట్ల మెజార్టీతో ఓటమిచెందారు. బీజేపీ ఇక్కడి నుంచి ప్రతిసారి పోటీ చేస్తున్నా కూడా గట్టి పోటీ ఇవ్వలేకపోతున్నారు.



ప్రచారం చేస్తున్న నాయకులు

వాల్గొండాలో బిఆర్ఎస్ నాయకుల ప్రచారం

నవతెలంగాణ-మల్లాపూర్

మండలంలోని వాల్గొండ గ్రామంలోని శ్రీ రామలింగేశ్వరస్వామి ఆలయంలో వచ్చే ఎన్నికల్లో బిఆర్ఎస్ అభ్యర్థి డాక్టర్ సంజయ్ భారీ మెజార్టీతో గెలవాలని మండల బిఆర్ఎస్ నాయకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, మండలాధ్యక్షుడు తోట శ్రీనివాస్, ఆర్ బి ఎస్ జిల్లా సభ్యులు డీలర్ మల్లయ్య, అధికార ప్రతినిధి ఆదిరెడ్డి, ప్రధాన కార్యదర్శి సురేష్ రావు, సర్పంచ్ ఫోరం అధ్యక్షుడు శ్రీనివాస్, పిఎసిఎస్ చైర్మన్ మోహన్‌రెడ్డి, నాయకులు ,రాజన్న నరేష్‌రెడ్డి, బైరి రవికుమార్ యాదవ్, అమీనుద్దీన్, రాకేష్ యాదవ్, దశ రెడ్డి నరేష్ రాజేందర్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లోకి ఎన్‌జీఓ నాయకుడు



నవతెలంగాణ-కోరుట్ల

కోరుట్ల పట్టణంలోని 2వ వార్డులోని ఎన్‌జిఓ నాయకుడు ముజీబ్ ఉర్ రెహ్మాన్‌తో పాటు 45 మంది చిన్నమెటుపల్లి గ్రామ యువకులు కాంగ్రెస్ అభ్యర్థి జువ్వాడి నర్సింగరావు ఆధ్వర్యంలో కాం గ్రెస్‌లో చేరారు. కుండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

ఎన్నికలు సజావుగా జరిగేందుకు సహకరించాలి

ఎన్నికల వ్యయ పరిశీలకులు షీల్ ఆశిష్

నవతెలంగాణ-జగిత్యాలటౌన్



మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారులు

ఎన్నికలు సజావుగా, ప్రశాంతంగా జరిగేలా రాజకీయ పార్టీలు జిల్లా యంత్రాంగానికి సహకరించాలని ఎన్నికల వ్యయ పరిశీలకులు షీల్ ఆశిష్ అన్నారు. సోమవారం జగిత్యాల కలెక్టరేట్‌లోని మీటింగ్ హాల్‌లో జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్, అదనపు కలెక్టర్లు కలిసి రాజకీయ పార్టీల ప్రతినిధులు, అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికలకు సంబంధించిన నిబంధనలను తెలుసుకోవాలన్నారు. పోటీ చేసే అభ్యర్థి రూ.40 లక్షలకు మించి ఖర్చు చేయకూడదని, అంతకంటే మించితే డిస్ క్వాలిఫై అవడం జరుగుతుందని చెప్పారు. సి విజిల్ యాప్ ద్వారా ఫిర్యాదులు చేయవచ్చని అన్నారు. ఏమైనా ఫిర్యాదులు ఉంటే 7780 137501 లేదా expenditure observer. jagtial@gmail.com. teliyapa ఫిర్యాదు చేయాలని సూచించారు. జిల్లా ఎన్నికల అధికారిణి, కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా మాట్లాడుతూ.. సి విజిల్‌పై జిల్లాలో స్వీప్ కార్యక్రమం క్రింద విస్తృత ప్రచారం నిర్వహించామని తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు బి.ఎస్.లత, దివాకర, అదనపు ఎస్పీ ప్రభాకర్, ఇతర శాఖల అధికారులు, నోడల్ అధికారులు పాల్గొన్నారు.



పథకాలను వివరిస్తున్న నాయకులు

కాంగ్రెస్ ఇంటింటికీ ప్రచారం

నవతెలంగాణ -మెట్‌పల్లి

కోరుట్ల కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి జువ్వాడి నర్సింగ్ రావును మద్దతు ఇవ్వాలని డాక్టర్ బెజ్జరపు శ్రీనివాస్ ఆర్ఎంపీ డాక్టర్‌లను, మాజీ సర్పంచ్‌లను కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎంపీ, పీఎంపీల రాష్ట్ర సంక్షేమ సంఘం అధ్యక్షుడు రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ కన్వీనర్ అబ్దుల్ హాఫిజ్, మెట్‌పల్లి మండలం కాంగ్రెస్ ఉపాధ్యాక్షులు ఇల్లేందుల రాజు, కాంగ్రెస్ మెట్‌పల్లి పట్టణ కాంగ్రెస్ కార్యదర్శి కంబ సురేష్ ,కసాడి దేవానందం తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరికలు

నవతెలంగాణ-ధర్మపురి

ధర్మపురి మండలంలోని నేరెళ్ల గ్రామానికి చెందిన పలువురు బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ అభ్యర్థి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ఆధ్వర్యంలో చేరగా వారికి జీవన్‌రెడ్డి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. గోవిందు పల్లెకు చెందిన మాజీ ఎంపీటీసీ రాజారపు రాజేశం, నేరెళ్ల ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు రెడ్డ వేణి సత్యం, తుమ్మనాల ఎంపీటీసీ ఆకుబత్తిని తిరుపతి, బైరి సత్తయ్య, మామిడిపల్లి గోపాల్, వేముల సురేష్ (ఎక్స్ వీఎస్ఎస్ చైర్మన్), పాదంశేఖర్, మర్రిబీరయ్య, కంచెశంకర్ చేరారు.



కొడిమ్యాలలో బీఆర్ఎస్ ప్రచారం



కరపత్రాలు అందజేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

నవతెలంగాణ- కొడిమ్యాల

కొడిమ్యాల మండల కేంద్రంలో బీఆర్ఎస్ నాయకులు ఇంటింటికీ తిరుగుతూ ప్రచారం నిర్వహించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచుల ఫోరం అధ్యక్షుడు పునుగోటి కృష్ణారావు, సింగిల్ విండో చైర్మన్ మేనేని రాజనర్సింగరావు, విండో చైర్మన్ పోలు రాజేందర్, మండల అధ్యక్షుడు పులి వెంకటేష్‌గౌడ్, సింగిరెడ్డి తిరుపతిరెడ్డి, ప్రసాద్ ఆయా గ్రామాల బిఆర్ఎస్ పార్టీ సర్పంచులు, ఎంపీటీసీ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో పలువురు చేరిక

నవతెలంగాణ-బుగ్గారం

మండలంలోని గోపులాపూర్ గ్రామానికి చెందిన ఉపసర్పంచ్ రాజేశ్వర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ బలుగూరి రామారావు, బుగ్గారం గ్రామం మాజీ సర్పంచ్ మసర్తి రాజారెడ్డితో పాటుగా వివిధ పార్టీల నుంచి సుమారుగా 100 మంది కాంగ్రెస్‌లో చేరారు. వారికి లక్ష్మణ్‌కుమార్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు వేముల సుభాష్, సీనియర్ నాయకులు మసర్తి నర్సయ్య, కోడిమ్యాల రాజన్న, కండ్లే మధన్, గైనీ శ్రీనివాస్,తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

నిరుపేద కుటుంబానికి అలయన్స్ క్లబ్ చేయూత

నవతెలంగాణ-బుగ్గారం



సరుకులు అందజేస్తున్న క్లబ్ సభ్యులు

బుగ్గారం మండల కేంద్రానికి చెందిన కండ్లే శంకర్ 20 రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. ధర్మారం అలయన్స్ క్లబ్ సభ్యులు బొల్లం మల్లేష్ స్పందించి 50 కిలోల బియ్యం, నిత్యావసర సరుకులను వారి కుటుంబానికి సోమవారం అంద జేశారు. ఈ కార్యక్రమంలో అలయన్స్ క్లబ్ అధ్యక్షుడు కొత్త మోహన్, క్లబ్ జోన్ చైర్మన్ తాళ్లపల్లి సురేందర్ గౌడ్, మండల కో -ఆప్షన్ మెంబర్ అబ్దుల్ రహమాన్, గ్రామ యువకులు తుడిచెర్ల శంకర్, బంద్ర శ్రీనివాస్, నగునూరి రాజశేఖర్, అబ్దుల్ అజీజ్, కొడిమ్యాల తిరుపతి పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

నవతెలంగాణ-ఇబ్రహీంపట్నం



ప్రారంభిస్తున్న సత్యనారాయణ

ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జిల్లా సహకార అధికారి సత్యనారాయణ సోమవారం ప్రారంభించారు. రైతులు వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యదర్శి సురేందర్, సంఘ కార్యదర్శి సతీష్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుల ప్రచారం

నవతెలంగాణ-పెగడపల్లి

పెగడపల్లి మండల పరిధిలోని బతికేపెల్లి, ఆరవెల్లి గ్రామాల్లో సోమవారం కాంగ్రెస్ మండల శాఖ ఆధ్వర్యంలో ఆరు గ్యారంటీలపై నాయకులు గడప గడపకు వెళ్లి ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు బుర్ర రాములు గౌడ్, సర్పంచ్‌లు ఈరెల్లి శంకర్, తాటిపర్తి శోభారాణి,ఎంపీటీసీ పూసాల శోభ తిరుపతి, కడారి తిరుపతి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ఒరుగుల శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు సంధి మల్లారెడ్డి, తడగొండ రాజు, ప్రధానకార్యదర్శులు చాట్ల భాస్కర్, గోగూరి సతీష్‌రెడ్డి, పూసాల తిరుపతి, కడారి తిరుపతి, సింగసాని స్వామి, మల్లేశం, సుధీర్, ప్రభాకర్ నాయకులు పాల్గొన్నారు.

డిజిటల్ లావాదేవీలపై నిఘా

- బ్యాంకు ఖాతాలపై దృష్టి
- రోజువారీ సమాచారం సేకరిస్తున్న అధికారులు

నవతెలంగాణ-సిరిసిల్ల:
డిజిటల్ లావాదేవీలపై ఎన్నికల అధికార యంత్రాంగం నిఘా పెంచింది. ఎన్నికల ప్రచారం ప్రారంభం కావడంతో ఓటర్లను ప్రలోభ పెట్టడానికి రాజకీయ నాయకులు వివిధ మార్గాల్లో తమ ప్రయత్నాలు ప్రారంభించారు. ధనం, మద్యంతో ఓటర్లను ఆకట్టుకునేందుకు రాజకీయ నేతలు వేస్తున్న ఎత్తుగడలను అడ్డుకునేందుకు ఎన్నికల సంఘం ప్రత్యేక చర్యలు చేపట్టింది. ఈ క్రమంలో భాగంగా ఆదాయ పన్ను, పోలీస్ శాఖల అధికారులు బ్యాంకు ఖాతాలపై దృష్టి సారించారు. డిజిటల్ లావాదేవీలు పరిమితికి మించి జరుగుతున్నాయని ఎన్నికల సంఘా నికి ఫిర్యాదులు వెళ్లడంతో అధికారులు యూపీఐ లావాదేవీలు, బ్యాంకు ఖాతాలపైన కూడా నిఘా పెంచారు.

• జిల్లాలో లావాదేవీలపై నిఘా

రాజన్న సిరిసిల్ల జిల్లాలో ప్రభుత్వ ప్రైవేటు రంగ బ్యాంకులు వందకు పైగా ఉన్నాయి. ఎన్నికల సమయంలో ఈ బ్యాంకులోని ఖాతాలపై ఆదాయపు పన్ను, పోలీసు శాఖల అధికారులు నిఘా ఉంచారు. ముఖ్యంగా జీరో బ్యాలెన్స్ ఖాతాలపై ప్రత్యేకంగా దృష్టి సారించారు. సాధారణంగా బ్యాంకుల్లో 49 వేల లోపు నిర్వహించే లావాదేవీలపై ఎలాంటి ఆంక్షలు ఉండవు. 50 వేల పైన నిర్వహించే లావాదేవీలకు తప్పనిసరిగా పాన్ కార్డు వివరాలు తెలియజేయాల్సి ఉంటుంది. లక్ష రూపాయలకు మించి లావాదేవీలు జరిగే ఖాతాలపైన అధికారులు దృష్టి సారిస్తున్నారు. గత కొంతకాలంగా లావాదేవీలు జరగని జీరో బ్యాలెన్స్ ఖాతాల పైన కూడా అధికారులు దృష్టి సారించారు. అభ్యర్థుల విజయవకాశాలను ప్రభావితం చేయడంలో కీలకంగా వ్యవహరించే మహిళా ఓటర్లను ప్రలోభాలకు గురి చేసేందుకు రాజకీయ పార్టీలు తీవ్రంగా ప్రయత్నిస్తున్నాయి. పేద బడుగు బలహీన వర్గాలైన మహిళా సంఘాల సభ్యులు, ఉపాధిహామీ కూలీలు, ఆసరా పింఛన్‌దారుల ఖాతాలపైన కూడా అధికారులు ప్రత్యేకంగా దృష్టి సారించారు.

• వినియోగం లేని అకౌంట్లపై..

కొంతకాలంగా వినియోగంలో లేని ఖాతాలతో పాటు ఎక్కువ మొత్తంలో డబ్బులు జమ అయ్యే ఖాతాలపైన వారు నిఘా పెట్టారు. వివిధ రాజకీయ పార్టీల ముఖ్య నేతలు ప్రముఖుల వివిధ సంఘాల ఖాతాల్లో జరిగే లావాదేవీలపైన అధికారులు కన్నేసి ఉంచారు. ప్రలోభాలకు గురి చేసే వాటిలో అతి ముఖ్యమైన డబ్బు మద్యం అక్రమ సరఫరాను నిరోధించేందుకు ఎన్నికల సంఘం ఒక్కో అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో ప్రత్యేక తనిఖీ బృందాలను ఏర్పాటు చేసింది. ఈ తనిఖీ బృందాలు తమ పరిధిలో ఎలాంటి ఆధారాలు లేకుండా అక్రమంగా తరలించే డబ్బులను స్వాధీనం చేసుకుని రిటర్నింగ్ అధికారి, ఆదాయ పన్నుశాఖ అధికారులకు అప్పగిస్తున్నారు. డిజిటల్ లావాదేవీలపైన కూడా అధికారులు ఎప్పటి కప్పుడు ఆరాధిస్తున్నారు. సేవింగ్, కరెంటు ఖాతాలతో పాటు జీరో బ్యాలెన్స్ ఖాతాలపై కూడా నిఘాపెట్టారు. అత్యధిక లావాదేవీలు నిర్వహించే ఖాతాదారులపై ఆంక్షలు విధించే అవకాశం ఉంది. ఫోన్ పే, గూగుల్, పేటీఎం, ఆన్లైన్ బ్యాంకింగ్ లావాదేవీలతో పాటు పరిమితికి మించిన లావాదేవీలు నిర్వహించే ఖాతాల వివరాలను ఎన్నికల సంఘం, ఆదాయ పన్నుశాఖ అధికారులకు అందజేయనున్నారు.

సిరిసిల్ల బాలికల ప్రతిభ

నవతెలంగాణ-సిరిసిల్ల రూరల్:


విద్యార్థినులను అభినందిస్తున్న హెచ్ఎం

సదిశ ఫౌండేషన్ స్వచ్ఛంద సంస్థ వారు ఆదివారం శ్రీ చైతన్య డిగ్రీ కాలేజ్, మంకమ్మ తోట కరీంనగర్‌లో నిర్వహించిన ప్రతిభా పరీక్షలో ఉమ్మడి కరీంనగర్ జిల్లా పరిధిలోని పాఠశాలల విద్యార్థులు సుమారుగా 1200ల మంది పరీక్ష రాయగా వ్యక్తిగత విభాగంలో జిల్లా పరిషత్ హై స్కూల్ నెహ్రూనగర్ సిరిసిల్ల నుంచి పదో తరగతి చదువుతున్న విద్యార్థులు దువ్వాల లాస్య బడుగు వైష్ణవిలు అత్యంత ప్రతిభ కనబర్చారు. రెండు సంవత్సరాలు ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ కార్పొరేట్ కళాశాలలో ఉచితంగా చదివే అవకాశం పొందారు. ఈ సందర్భంగా విద్యార్థులను నెహ్రూ నగ ర్ ప్రధానోపాధ్యాయురాలు నాగుల భాగ్యరేఖ, పాఠశాల ఉపాధ్యా యులు రోమాల లచ్చయ్య, ద్యావనపల్లి పరమేష్, గుత్తికొండ రాజశేఖర్, గన్నమనేని శ్రీనివాసరావు కోడం భారతి, సలావుద్దీన్, అడుప కీర్తి, రాచర్ల వెంకన్న చిమ్మని సువర్ణ కొలుగూరి రజితలు మెమెంటో బహుమతులతో అభినందించారు.

మర్రిగడ్డలో కాంగ్రెస్ పార్టీ ప్రచారం

నవతెలంగాణ-చందుర్తి:


ప్రచారం చేస్తున్న నాయకులు

కాంగ్రెస్ అభ్యర్థి అది శ్రీనివాస్ తరుపున సోమవారం మర్రిగడ్డ గ్రామంలో జడ్పీటీసీ నాగం కుమార్, యువజన నాయకులు ధర్మపురి శ్రీనివాస్, సర్పంచ్ జలపతి మధు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ ఆరు గ్యారంటీలను అమలు చేస్తుందని తెలిపారు.

బీఎస్పీ వాదం..బహుజన నాదం..

నవతెలంగాణ-చందుర్తి: బీఎస్పీ నాదం బహుజనవాదం అని బీఎస్పీ అభ్యర్థి గోలి మోహన్ అన్నారు. సోమవారం తిమ్మాపూర్ గ్రామంలో ప్రచారం నిర్వహించారు. ఏనుగు గుర్తుకు ఓటు వేస్తే సామాన్య ప్రజలకు న్యాయం జరుగుతుందని అన్నారు. ఆయన వెంట కోరుట్ల రమేష్ గ్రామస్తులు ఉన్నారు.

గల్ఫ్ మృతుడి కుటుంబానికి ఆర్థిక సహాయం

నవతెలంగాణ-రుద్రంగి:


ఆర్థిక సహాయం అందజేస్తున్న నాయకులు

మండల కేంద్రానికి చెందిన చిట్టపురం భూమేశ్వర్ అనే వ్యక్తి నెల రోజుల క్రితం కువైట్ దేశంలో అనారోగ్యంతో మృతి చెందాడు. మృతు డికి భార్య ముగ్గురు పిల్లలు ఉన్నారు. వారి పరిస్థితి దాయనియంగా మారిం దని తెలుసుకున్న రుద్రంగి మస్కట్ సేవ సమితి సభ్యులు 5000ల రూపా యలు ఆర్థిక సహాయం అందజేశారు. మస్కట్ సేవ సమితి సభ్యులు పాల్గొన్నారు.

చెట్ల పొదల్లో పసికందు మృతదేహం..

- సంఘటన స్థలాన్ని పరిశీలించిన పట్టణ సీఐ కరుణాకర్

నవతెలంగాణ-వేములవాడ: వేములవాడ పట్టణంలోని న్యూ అర్బన్ కాలనీలో ఉన్న చెట్ల పొదల్లో పసికందును పందులు, కుక్కలు పీక్కుతున్న అమానవీయ ఘటన సోమవారం పట్టణంలో కలకలం చోటు చేసుకుంది. చెట్ల పొదల నుంచి దుర్గంధం వెదజల్లడంతో అక్కడే ఆడుకుంటున్న పిల్లలు మృతదేహాన్ని గమనించి స్థానిక ప్రజలకు తెలియజేశారు. సమాచారం తెలుసుకున్న పట్టణ సీఐ కరుణాకర్ సంఘటన స్థలాన్ని పరిశీలించారు. ఘటనపై పూర్తి వివరాల తెలియాల్సి ఉందన్నారు. ఈ ఘటనపై పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

తెలంగాణ రాష్ట్ర ఉద్యమ పార్టీ.. కేసీఆర్ పార్టీ..

మావోయిస్టు మాజీ నేత నెరేళ్ల జ్యోతి

నవతెలంగాణ-కోనరావుపేట


మాట్లాడుతున్న జ్యోతి

తెలంగాణ రాష్ట్ర ఉద్యమ పార్టీ కేసీఆర్ పార్టీ అని, 19 ఏళ్ల అజ్ఞాత జీవితం నుంచి ప్రజల సేవ కోసం అభివృద్ధి వైపు వెళ్లాలని అనుకున్నానని మాజీ మావోయిస్టు నేత నెరేళ్ల జ్యోతి అన్నారు. సోమవారం కోనరావుపేట మండలం శివంగలపల్లిలో నెరేళ్ల జ్యోతి విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు. ఆమె మాట్లాడుతూ తను 19 సంవత్సరాల మావోయిస్టు పార్టీలో జీవితం గడిపానని, అనివార్య కారణాలతో తను లొంగిపోయి జన జీవన స్రవంతిలో కలిశానని అన్నారు. బీఆర్ఎస్ ఉద్యమ పార్టీ తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన పార్టీ అని తను అందులో చేరానని ఆమె అన్నారు.

ఢిల్లీ దొరల చేతిలో మరోసారి తెలంగాణ బంధి కావాలా..!

- కేసీఆర్ అంటేనే భరోసా, యువతకు భవిష్యత్..
- బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్

నవతెలంగాణ-వేములవాడ


సమావేశంలో మాట్లాడుతున్న కే రామారావు

ఢిల్లీ దొరల చేతో మరోసారి తెలంగాణ బందీ కావాలా.. లేక సీఎం కేసీఆర్ చేతిలో ముక్తి పొందాలో తెలంగాణ ప్రజలు ఆలోచించుకోవాలని.. కాంగ్రెస్ అహంకారికి.. నరేంద్ర మోదీ అహంకారానికి ఇద్దరు ఢిల్లీ దొరల పెంచం వచ్చే విధంగా తెలంగాణ ఆడబిడ్డలు సమాధానం చెప్పాలని కేటీఆర్ పేర్కొన్నారు. వేములవాడ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి చల్మెడ లక్ష్మీ నరసింహారావును భారీ మెజారిటీతో గెలిపిస్తే, వేములవాడ నియోజకవర్గాన్ని దత్తత తీసుకుంటానని బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్ హామీ ఇచ్చారు. సోమవారం వేములవాడ పట్టణంలో జరిగిన యువ ఆత్మీయ సమ్మేళనానికి కేటీఆర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కే రామారావు మాట్లాడుతూ కేసీఆర్ అంటేనే భరోసా, యువ తకు భవిష్యత్ అని అన్నారు. ఇప్పుడు జరుగుతున్న ఎన్నికలు కేవలం ఇద్దరి వ్యక్తుల మధ్యనో, లక్ష్మీ నరసింహారావు కొరకో జరుగుతున్న ఎన్నికలు కావు, ఉద్యమ నాయకుడు సీఎం కేసీఆర్ కోసం జరుగుతున్న ఎన్నికలు, రెండు పార్టీల మధ్యన జరుగుతున్న ఎన్నికలు అని అన్నారు. ఎమ్మెల్యే అభ్యర్థి చల్మెడ లక్ష్మీనర్సింహారావు మాట్లాడుతూ తమ యువ నాయకుడు కేటీఆర్ కేవలం వ్యక్తి కాదు, తెలంగాణ బ్రాండ్ అంబాసిడర్. యువ కుల భవిష్యత్ బాగుండా లని, ప్రపంచంలోని చాలా దేశాలు తిరిగి పెట్టుబడులు తీసుకువచ్చి ఈనాడు ఐట ీకి కేరాఫ్ అడ్రస్ గా హైదరాబాద్ ను మార్చిన ఘనత కేటీఆర్‌కు దక్కుతుంది అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు బోయినిపల్లి వినోద్ కుమార్, నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్, మార్క్ ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపు రెడ్డి,జడ్పీ చైర్ పర్సన్ అరుణ-రాఘవ రెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ రామతీర్థపు మాధవి, విద్యార్థి జేఏసీ నాయకులు మందాల భాస్కర్, సీనియర్ నాయకులు మనోహంరెడ్డి, దరువు ఎల్లన్న, నాయకులు వెంగళ శ్రీకాంత్ గౌడ్, ఈర్లపల్లి రాజు, కౌన్సిలర్లతో పాటు ఆయా మండలాల యువజన,విద్యార్థి విభాగం అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శిలతో పాటు సుమారు 20వేల మంది విద్యార్థులు, యువకులు పాల్గొన్నారు.

యువగర్జనకు బైక్ ర్యాలీగా తరలిన యువకులు

నవతెలంగాణ-రుద్రంగి:


ర్యాలీగా వెళ్తున్న నాయకులు

బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో వేముల వాడలో నిర్వహించిన యువగర్జన సభకు రుద్రంగి బీఆర్ఎస్ యూత్ అధ్యక్షుడు కోడిగంటి శ్యామ్ ఆధ్వర్యంలో 200ల బైక్‌లతో యువకులు ర్యాలీగా తరలి వెళ్లారు. ఎంపీపీ గంగం స్వరూప- మహే ష్, జడ్పీటీసీ గట్ల మీనయ్య, సెస్ డైరెక్టర్ ఆకుల గంగారాం, గ్రామశాఖ అధ్యక్షుడు దయ్యాల కమలాకర్, ప్యాక్స్ డైరెక్టర్ కేసిరెడ్డి నర్సారెడ్డి, ఎంపీటీసీ మంచే రాజేశం, గొళ్ళెం నర్సింగ్, మంచే రమేష్, నర్సయ్య, పాల నర్సయ్య, తలారి నర్సయ్య, ఉప్పులూటీ గణేష్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో సీపీఐ బృందం పర్యటన

నవతెలంగాణ-సిరిసిల్ల రూరల్: పట్టణంలోని సిరిసిల్లలోని ప్రభుత్వ పాఠశాలలోని కొనసాగు తున్న విద్యార్థులకు సీఎం బ్రేక్ఫాస్ట్ పథకంలో భాగంగా సోమవారం సిపిఐ ప్రతినిధి బృందం పర్యటించారు. ఈ సందర్భంగా పార్టీ పట్టణ కార్యదర్శి పంతం రవి ప్రకటన విడుదల చేస్తూ దసరా సెలవుల తర్వాత ప్రభుత్వ పాఠశాలలోని ప్రతి విద్యార్థికి సీఎం బ్రేక్ఫాస్ట్ పథకం ద్వారా ఉదయం పూట అల్పాహారం అందిస్తామని ఎన్నికలు సమీపిస్తుండడంతో క్షేత్రస్థాయిలో ఎటువంటి ప్రణాళికలు రూపొందించకుండానే పాఠశాలలో ఉండే మధ్యాహ్న భోజన కార్మికులకు గతంలో రావల్సిన బిల్లులో ఇప్పటివరకు ప్రభుత్వం చెల్లించలేదన్నారు. ఇప్పుడు మళ్లీ విద్యార్థులకు అల్పాహారం అందించాలని నిర్ణయించడంతో వారు తమకు ముందస్తుగా బిల్లులు చెల్లిస్తే తప్ప మేము అల్పాహారం అందించలేమని మధ్యాహ్న భోజన కార్మికులు తెలిపారన్నారు. కనీస వేతనాలు చెల్లించాలని నెల రోజుల క్రితం సుమారు 15 రోజులు ఆందోళనలు చేసినా స్పందించిన ప్రభుత్వం స్పందించలేదన్నారు. ఇప్పటికైనా మధ్యాహ్న భోజన కార్మికులకు పెండింగ్ బిల్లులు చెల్లించాలని, రవి డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు అర్జ వేణు, సోమ నాగరాజు, రాజేశ్వరి, రమక్క పాల్గొన్నారు.

ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణకు చర్యలు

- జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్

నవతెలంగాణ-వేములవాడ రూరల్


పరిసరాలను పర్యవేక్షిస్తున్న ఎస్పీ

ప్రశాంత వాతవారణంలో అసెంబ్లీ ఎన్నికల నిర్వహణకు పకడ్బందీ చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. వేములవాడ రురల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని క్రిటికల్, నార్మల్ పోలింగ్ స్టేషన్స్‌ల వద్ద తనిఖీ నిర్వహించారు. సోమవారం వేములవాడ రురల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని వట్టెముల, ఫజుల్ నగర్, నుకలమర్రి, ఏదురుగాట్ల, మర్రిపెల్లి, లింగంపెల్లి, గ్రామాల్లోని నార్మల్, క్రిటికల్ పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేసి శాంతియుత వాతావరణంలో ఎన్నికల జరిగేలా అన్ని రకాల భద్రత చర్యలు తీసుకోవాలని ఎస్పీ అధికారులను ఆదేశించారు. సమ స్యాత్మక గ్రామాలను విధిగా పర్యటిస్తూ ఆ గ్రామాలపై దృష్టిసారించాలని అధికారులకు తెలిపారు. ప్రతి ఒక్కరూ ఎన్నికల నియమావళిని పాటించాలని ప్రయాణ సమయాల్లో యాభై వేళా కంటే ఎక్కువ నగదు తీసుకవేళ్ళేవారు వాటికి సంబంధించిన సరైన పత్రాలు దగ్గర పెట్టుకోవాలని సూచించారు. ఎస్పీ వెంట డిఎస్పీ నాగేంద్రచరి, సీఐ కృష్ణకుమార్, ఎస్.ఐ మారుతి సిబ్బంది ఉన్నారు.

బీఆర్ఎస్‌కు భారీ షాక్

నవతెలంగాణ-వేములవాడ


పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఆది శ్రీనివాస్

వేములవాడ పట్టణంలోని బీఆర్ఎస్‌కు ఊహించని భారీ షాక్ తగిలింది. పట్టణ అధ్యక్షుడు పుల్కం రాజు, కౌన్సిలర్ బింగి మహేష్ , కోఆప్షన్ మెంబర్ పుల్కం శ్రీలక్ష్మి బీఆర్ఎస్‌కు రాజీనామా చేశారు. సోమవారం కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు, వేములవాడ ఎమ్మెల్యే అభ్యర్థి ఆది శ్రీనివాస్ సమక్షంలో చేరారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు చంద్రగిరి శ్రీనివాస్ గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు సాగర వెంకటస్వామి, నాయకులు పులి రాంబాబు గౌడ్, సంఘ స్వామి యాదవ్, మునీందర్, వస్తాది కృష్ణ ప్రసాద్ పాల్గొన్నారు.

నేడు మంథనికి సీఎం కేసీఆర్ రాక

ప్రజా ఆశీర్వాద సభలో పాల్గొననున్న ముఖ్యమంత్రి

నవతెలంగాణ-మంథని

ఎన్నికల ప్రచారంలో భాగంగా మంథనిలో మంగళవారం మధ్యాహ్నం జరిగే ప్రజా ఆశీర్వాద సభకు బీఆర్ఎస్ అధినేత ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు మంథనికి రానున్నారు. మంథని గోదావరిఖని రహదారిని ఆనుకుని ఉన్న ప్రాంతంలో తలపెట్టిన సభ కోసం ఏర్పాట్లు అన్ని సిద్ధం చేశారు. మధ్యాహ్నం రెండు గంటలకు బహిరంగ సభ జరగనుండగా ముఖ్యమంత్రి కేసీఆర్ అదే సమయానికి హెలికాప్టర్‌లో అక్కడికి చేరుకుని ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తారు.

కేసీఆర్ బహిరంగ సభను విజయవంతం చేయాలి

బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి పుట్ట మధుకర్

సీఎం కేసీఆర్ ప్రజా ఆశీర్వాద సభకు పెద్ద సంఖ్యలో ప్రజలు తరలివచ్చి విజయవంతం చేయాలని బీఆర్ఎస్ మంథని నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి పుట్ట మధుకర్



సభాస్థలిని పరిశీలిస్తున్న జడ్పీ చైర్మన్ పుట్టమధు

పిలుపునిచ్చారు. సోమవారం ప్రజా ఆశీర్వాద సభకు సంబంధించిన ఏర్పాట్లను పరిశీలించారు.అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఓట్లు రాగానే నోట్ల సంచులతో వచ్చి కొనుగోలు జరుపుతున్నారన్నారు. నవంబర్ 30న ప్రజలు ఓట్లు వేసి మంచి నాయకున్ని ఎన్నుకోవాలన్నారు. సభకు తరలివచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.

సోషల్ మీడియా, వెబ్‌సైట్‌లలో ఎన్నికల ప్రచారానికి అనుమతి తీసుకోవాలి

రామగుండం రిటర్నింగ్ అధికారి జె.అరుణశ్రీ

నవతెలంగాణ-గోదావరిఖని:



రిటర్నింగ్ అధికారి జె.అరుణశ్రీ

రామగుండం నియోజకవర్గ పరిధిలో ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున సామాజిక మాధ్యమాలైన ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, వాట్సప్ యూట్యూబ్, ట్విట్టర్, తదితర సామాజిక మాధ్యమాలలో (ఎంసీఎంసీ) మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ నుంచి అనుమతి తీసుకొని ప్రచారం చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు), రామగుండం రిటర్నింగ్ అధికారి జే.అరుణశ్రీ ఒక ప్రకటనలో తెలిపారు.

39వ డివిజన్‌లో టీఎల్పీ ప్రచారం

నవతెలంగాణ-గోదావరిఖని టౌన్:



మాట్లాడుతున్న టీఎల్పీ అభ్యర్థి గొర్రె రమేష్

రామగుండం కార్పొరేషన్ 39వడివిజన్ ప్రగతి నగర్, మాతంగి కాలనీ, కాజీపల్లి, విఘ్నేశ్వర నగర్, గౌతమీ నగర్ ఏరియాల్లో తెలంగాణ లేబర్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు గొర్రె రమేష్ సోమవారం ప్రచారాన్ని నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రామగుండం నియోజకవర్గంలో జరిగే ఎన్నికల్లో ధనాన్ని ప్రచారాల పేరుతో విచ్చలవిడిగా ఖర్చు చేస్తున్నారన్నారు. రామగుండం ఎమ్మెల్యే దోచుకున్నది దాచుకొని కోట్ల రూపాయలు ఖర్చు పెట్టి గెలవాలనుకుంటున్నాడని అన్నారు. కాంగ్రెస్ ఆ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి మక్కాన్‌సింగ్ ఐదేళ్ల షాప్ చైర్మన్‌గా ఉండి ఎవరికి ఎలాంటి సహాయం చేయలేదని, రౌడీయి జానికి, గుండాయిజానికి ప్రతిరూపమైన ఆయనకు అవకాశం ఇస్తే అంతే సంగతి అన్నారు. ఈ ప్రచారంలో నాయకులు అల్లెపు తిరుపతి, కన్నం భాను చందర్, మంద మొగిలి పలువు ఉన్నారు.

యాష్ పాండ్ కార్మికులను కలిసిన కాంగ్రెస్ అభ్యర్థి

నవతెలంగాణ-గోదావరిఖని:



కార్మికులతో మాట్లాడుతున్న మక్కాన్‌సింగ్

కుందనపల్లి యాష్ పాండ్ కార్మికులను కాంగ్రెస్ రామగుండం అభ్యర్థి మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ సోమవారం కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక శాసన సభ్యుడు బూడిద దోపిడి చేసి ఉపాధి లేకుండా చేశాడని ఆరోపించారు. బి పవర్ హౌజ్‌ను మూసివేయాలని చూస్తున్నారని, పోరాటం చేసి బి పవర్ హౌజ్‌ను కాపాడుకుందామని అన్నారు. రామగుండం ప్రాంత అభివృద్ధి కోసం తనకు ఒక్క అవకాశం చేతి గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీలో చేరిన ఆటో యూనియన్ సభ్యులు

రామగుండం మజీద్ టర్నింగ్ ఆటో స్టాండ్ వద్ద సోమవారం లింగపూర్, విలేజ్ రామగుండం ఆటో ఓనర్స్, డ్రైవర్ల యూనియన్ సభ్యులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారికి రామగుండం కాంగ్రెస్ అభ్యర్థి మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

ఆరు గ్యారంటీలను విస్తృతంగా ప్రచారం చేయండి



పార్టీలో చేరిన వారితో మాజీ ఎమ్మెల్యే విజయరమణారావు

నవ తెలంగాణ -సుల్తానాబాద్ రూరల్ :

సుల్తానాబాద్ మండలం,గర్రెపల్లి గ్రామానికి చెందిన బీజేపీ, బీఆర్ఎస్ పార్టీల నాయకులు పెరుమాండ్ల సన్నిత్, పులి మణిదీప్, భైరగోని సాయికృష్ణ, కొలిపాక రాజు,తిరుపతి, కుమార్, అరుణ్, శ్రీనివాస్, అజయ్, కృష్ణ, అరవింద్, శరత్, చిన్న శరత్‌లు పెద్దపల్లి ఎమ్మెల్యే అభ్యర్థి చింత కుంట విజయరమణారావు సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి కాంగ్రెస్ పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

60ఏళ్లలో కాంగ్రెస్ ఏం చేసిందో చెప్పాలి

బీఆర్ఎస్ నాయకులు పర్లపల్లి రవి, జేవీ రాజు

నవతెలంగాణ-గోదావరిఖని:

60 ఏళ్లలో కాంగ్రెస్ అధికారంలో ఉండి చేసింది ఏంటో చెప్పాలని బీఆర్ఎస్ పార్టీ నాయకులు పర్లపల్లి రవి,జేవీ రాజుఅన్నారు. గోదావరిఖనిలోని బీఆర్ఎస్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ వలస వచ్చే నాయకులకు వలసలు మాత్రమే కనబడుతాయితప్ప...రామగుండం నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి మాత్రం కనబడటం లేదా అని అన్నారు. గోదావరిఖని పీజీ కళాశాలకు అనుబంధంగా రావాల్సిన మైనింగ్ కళాశాలను కూడా జేఎన్టీయూ అనుబంధంగా మంథనిలో మైనింగ్ కళాశాల ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. రామగుండం ప్రాంతానికి రావాల్సిన వాటిని రాకుండా కాంగ్రెస్



మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు పర్లపల్లి రవి,జేవీ రాజు

నాయకులు రామగుండం నియోజకవర్గంలో ఎలాంటి అభివృద్ధి చేస్తారో అర్థం అవుతుందని అన్నారు. ఈ విలేకరుల సమావేశంలో నాయకులు మాదాస్ రామ్మూర్తి, సీహెచ్ మొగిలి, మురళీధర్ రావు, దాసరి ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

మద్దతు ధరను రైతులు ఉపయోగించుకోవాలి

పెద్దపల్లి జిల్లా అదనపు కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ లాల్

నవతెలంగాణ-మంథని

వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించి రైతులు మద్దతు ధరను ఉపయోగించుకోవాలని పెద్దపల్లి జిల్లా అదనపు కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ లాల్ అన్నారు.ఎక్లాస్‌పూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను పెద్దపల్లి జిల్లా అదనపు కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ లాల్ జిల్లా సహకార అధికారి శ్రీమాలతో కలిసి సోమవారం ప్రారంభించారు.ఈ సందర్భంగా శ్యామ్ ప్రసాద్ లాల్ మాట్లాడుతూ వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతువారి కొనుగోలు, ట్రాన్స్‌పోర్ట్,గన్నీతదితర రికార్డులను నిర్వహించాలని



ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తున్న శ్యాంప్రసాద్ లాల్

సూచించారు. జిల్లా సహకార అధికారి శ్రీమాల మాట్లాడుతూ, నిర్దేశించిన నాణ్యత ప్రమాణాల ప్రకారం,17 శాతం తేమ కలిగిన వరి ధాన్యం కొనుగోలు చేయాలని అన్నారు. మద్దతు ధర ఏ గ్రేడు రూ.2203, సాధారణ రకానికి 2183 ధర కల్పిస్తున్నామని,దీనిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.

కాంగ్రెస్‌లో చేరికలు

నవతెలంగాణ-ముత్తారం:

ముత్తారం మండలం ఓడేడు గ్రామంలోని యాదవ సంఘం, హమాలీ సంఘం, ఎస్టీ కాలనీ నుంచి 40 మంది బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు మంథని ఎమ్మెల్యే దుద్దిళ్ళ శ్రీధర్‌బాబు సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు., వారికి శ్రీధర్‌బాబు పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కాంగ్రెస్‌తోనే అన్ని వర్గాలకు న్యాయం జరుగుతుందని భావించి, పెద్ద ఎత్తున బీఆర్ఎస్, బీజేపీల నుంచి కాంగ్రెస్‌లో చేరుతున్నారన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్



కండువాలు కప్పి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే

పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు చొప్పరి సదానందం, దాసరి చంద్రమౌళి, తీగల సత్యనారాయణ, కోటగిరి శ్రీనివాస్, యాదగిరి రావు తదితరులున్నారు.

ముత్తారం మండలం కాంగ్రెస్ పార్టీ మహిళా కమిటీ ఉపాధ్యక్షురాలిగా అచ్చె జ్యోతి



నియామకపు ఉత్తర్వులు అందజేస్తున్న మండల అధ్యక్షురాలు

నవతెలంగాణ-ముత్తారం:

ముత్తారం మండలం కాంగ్రెస్ పార్టీ మహిళ కమిటీ ఉపాధ్యక్షురాలిగా ఖమ్మంపల్లి గ్రామానికి చెందిన అచ్చె జ్యోతి నియామకం అయ్యారు. మంథని ఎమ్మెల్యే దుద్దిళ్ళ శ్రీధర్‌బాబు ఆదేశాల మేరకు ముత్తారం మండల మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు గోవిందుల పద్మ ఆనంద్ నియామకపు ఉత్తర్వులను అందజేశారు.

ఓటు ప్రాముఖ్యతపై అవగాహన సదస్సు



అవగాహన కల్పిస్తున్న అధికారులు

నవతెలంగాణ-గోదావరిఖని టౌన్:

రామగుండం నియోజకవర్గ పరిధిలో జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు), రామగుండం నియోజకవర్గ రిటర్నింగ్ ఆఫీసర్ (ఆర్వో) అరుణశ్రీ ఆదేశాల మేరకు స్వీప్ ఆధ్వర్యంలో ఓటరు అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సీహెచ్ నాగేశ్వర్, రామగుండం స్వీప్ నోడల్ ఆఫీసర్ స్వరూపరాణి పాల్గొన్నారు. చైతన్యరథంతో కళాజాతర బృందంతో ఓటరు అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో మెప్మా సీవోలు జూనియర్ అసిస్టెంట్లు, మున్సిపల్ సిబ్బంది, ఆర్‌పీలు,ఆశా వర్కర్లు, అంగన్వాడీ సిబ్బంది, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్‌లో చేరిక



కండువా కప్పి ఆహ్వానిస్తున్న జడ్పీ చైర్మన్

నవతెలంగాణ-ముత్తారం:

ముత్తారం మండల కేంద్రం నుంచి కాంగ్రెస్ పార్టీలోని 30 మంది యువకులు వైస్ఎంపీపీ సుధాటి రవీందర్‌రావు ఆధ్వర్యంలో సోమవారం బీఆర్ఎస్‌లో చేరారు. ముత్తారం గ్రామానికి చెందిన యూత్ సభ్యులు పెయ్యల సాయి కిరణ్, ఉప్పల అనిల్ తేజ, మద్రి అశోక్,బత్తుల రాజకుమార్, తాత కిరణ్, కళావేనా అరవింద్, కళావేనా మధుకర్, కళావేనా కిరణ్, బర్ల కుమార్, చింతల ప్రశాంత్, చందుతోపాటు పలువురు బీఆర్ఎస్‌లో చేరారు. వారికి పెద్దపల్లి జడ్పీ చైర్మన్ పుట్ట మధూకర్ పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృ ద్ధిని చూసి బీఆర్ఎస్‌లో చేరుతున్నారన్నారు. కార్యక్ర మంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పోతిపెద్ది కిషన్ రెడ్డి, ముత్తారం గ్రామ శాఖ అధ్యక్షుడు అలువోజు రవీందర్, దేవేందర్ తదితరులున్నారు.

నేడు పెద్దపల్లికి ముఖ్యమంత్రి రాక

ప్రజా ఆశీర్వాద సభలో ప్రసంగించనున్న కేసీఆర్

జనసమీకరణలో నిమగ్నమైన నాయకులు

నవతెలంగాణ- పెద్దపల్లి

ఎన్నికల ప్రచారంలో భాగంగా నేడు ముఖ్యమంత్రి కేసీఆర్ పెద్దపల్లికి జిల్లాకు రానున్నారు. పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని జూనియర్ కాలేజీ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన ప్రజా ఆశీర్వాద బహిరంగ సభలో ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రసంగించున్నారు. పెద్దపల్లి సిట్టింగ్ ఎమ్మెల్యే బీఆర్ఎస్ అభ్యర్థి మనోహర్ రెడ్డి ఎన్నికల ప్రచారంలో ముఖ్యమంత్రి కేసీఆర్ పాల్గొననున్నారు. ముఖ్యమంత్రి బహిరంగ సభకు నియోజకవర్గంలోని జనాన్ని పనిలో దాసరి మనోహర్ రెడ్డితో పాటు బీఆర్ఎస్ నాయకులు నిమగ్నమైనారు. సాయంత్రం మూడు గంటలకు పెద్దపల్లి జిల్లా కేంద్రానికి సీఎం కేసీఆర్ చేరుకుంటారు. ప్రజా ఆశీర్వాద సభలో ప్రధానంగా ఎన్నికల మ్యానిఫెస్టోలోని ప్రజలకు వివరించనున్నారు. సీఎం పర్యటన నేపథ్యంలో ఏలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పోలీసు అధికారులు పడగ్బంది ఏర్పాటు చేశారు.

నాయకుడిగా కాదు..సేవకుడిగా పని చేస్తా

- మంథని అభివృద్దే మా ధ్యేయం
- భారీ మెజార్టీతో గెలుస్తా
- నవతెలంగాణ ప్రత్యేక ఇంటర్వ్యూలో బీఆర్ఎస్ అభ్యర్థి పుట్ట మధూకర్



నవతెలంగాణ-మంథని
ఈ తొమ్మిదేళ్ల పాలనలో ఒకపక్క సంతృప్తి, మరోపక్క కొంత అసంతృప్తితో ఉన్న నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉన్నప్పటికీ నాయకుడిగా కాదు ప్రజా సేవకుడిగా పనిచేస్తా.. రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ సహకారంతో మంథని నియోజకవర్గం ముందుకు పోతుందని బీఆర్ఎస్ అభ్యర్థి పుట్ట మధూకర్ అన్నారు.

నవతెలంగాణ : బీఆర్ఎస్ పాలన ఎలా సాగింది?.

పుట్ట మధు : ఈ పదేళ్ల పాలన చాలా సంతృప్తినిచ్చింది ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉన్న నాయకుడిగా కాదు ప్రజా సేవకుడిగా పని చేశాను. మంథని నియోజకవర్గానికి నేనే బాస్ అని చెప్పుకునే మంథని ఎమ్మెల్యేకు ఓటమి తప్పదు.70 ఏళ్లలో ఏఅభ్యర్థికి రాని భారీ మెజార్టీతో మళ్లీ మంథనిలో మరోసారి విజయం సాధిస్తా.

నవతెలంగాణ : ఎన్నికల నేపథ్యంలో పరిస్థితులు ఎలా ఉన్నాయి?.

పుట్ట మధు : ఇప్పటికీ ఎప్పటికీ రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీదే హవా.. దేశంలో 29వ రాష్ట్రంగా ఏర్పడ్డ తెలంగాణ రాష్ట్రం దేశంలోనే ముఖ్యమంత్రి కేసీఆర్ నేతృత్వంలో అభివృద్ధి సంక్షేమంలో నెంబర్ వన్‌గా నిలిచింది. రాష్ట్రంలో అభివృద్ధి కొనసాగాలంటే మరోసారి కేసీఆర్ సీఎం కావాలని తెలంగాణ ప్రజలు ఆకాంక్షిస్తున్నారు.

నవతెలంగాణ : మీకు అత్యంత సంతృప్తినిచ్చిన అంశం ఏమిటి?.

పుట్ట మధు : గతంలో మంథని నుంచి గెలిచిన ఎమ్మెల్యేలు ఎవరు పేద ప్రజలను, నిరంతరం ఉపయోగించే ఆసుపత్రులను, రహదారులను, అభివృద్ధి వైపు కన్నెత్తి చూడలేదు. ఖరీదైన వైద్యాన్ని ప్రతి సామాన్యుడికి అందేలా చొరవ చూపాం...పుట్ట లింగమ్మ ట్రస్ట్ ద్వారా అనేక సహాయ సహకారాలు అందించాం.. ప్రభుత్వ కాలేజీల్లో ఇంటర్,డిగ్రీ చదువుతున్న పేద విద్యార్థులకు అన్నం పెట్టించా..ఒక పేద బిడ్డగా ఇంతకంటే నాకు సంతృప్తి ఏముంటుంది చెప్పండి..దశాబ్దాల తరబడి ఇక్కడ ఎమ్మెల్యేలుగా గెలిచి మంత్రులుగా పనిచేసిన వ్యక్తులు సాధించలేని రింగ్ రోడ్డుతో పాటు రహదారులు,మారుమూల ప్రాంతాల్లో రహదారుల బ్రిడ్జిలను నిర్మించి, నియోజకవర్గ అభివృద్ధికి ఎంతో తోడ్పాటు అందించాను.

నవతెలంగాణ : మంథని నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి ఏమిటి?

పుట్ట మధు: నేను నాలుగేళ్ల మూడు నెలలు ఎమ్మెల్యేగా పనిచేశా ఆ తరువాత పెద్దపల్లి జడ్పీ చైర్మన్‌గా చేస్తున్న ఈ తొమ్మిదేళ్లలో జరిగిన అభివృద్ధి అసలు మంథని నియోజకవర్గ చరిత్రలో ఎన్నడు ఎప్పుడు జరగలేదు. గతంలో పాలించిన ఒకే కుటుంబం ప్రజలకు చేసింది ఏమీ లేదు.భూపాలపల్లి తడ్వాయి ఖమ్మంపల్లి కాటారం రోడ్డ అభివృద్ధి జరగాలంటే మళ్లీ బీఆర్ఎస్ ప్రభుత్వం రావాలి. మంథనిలో అంబులెన్స్ సౌకర్యాలు ఆస్పత్రులను ఆధునీకరించి ప్రజలకు వైద్యాన్ని చేరువ చేశా..

నవతెలంగాణ : మీ కుటుంబ రాజకీయ నేపథ్యం ఏమిటి?

పుట్ట మధు : మాది పూర్తిగా రైతు కుటుంబం. ఇక్కడే పుట్టి ఇక్కడే పెరిగిన పేద బిడ్డను నేను. ప్రజలకు సేవచేస్తూ ఎంపీటీసీగా,ఎంపీపీగా, జడ్పీటీసీగా ఎమ్మెల్యేగా, ప్రస్తుతం జడ్పీ చైర్మన్‌గా ఎదిగా...ఇంత ఎదిగినా ప్రజలకు ఇచ్చిన మాట తప్పలేదు. నిత్యం అందుబాటులో ఉంటూ వారి కష్టాలు కన్నీళ్లను తుడిచా..స్థానికుడిని కాబట్టే ఈమట్టిపై మక్కువ ఎక్కువ.

నవతెలంగాణ : ప్రచార సరళి ఎలా జరుగుతున్నది?

పుట్ట మధు: సుమారు 23 ఏళ్లుగా నేను రాజకీయాల్లో కొనసాగుతున్నా.. ఏ పార్టీని ప్రజలు ఇంత గొప్పగా ఆదరించలేదు...ఇలా నిరాజనం పట్టిన పరిస్థితులు చూడలేదు. నియోజకవర్గ వ్యాప్తంగా బీఆర్ఎస్‌కు మద్దతుగా నిలుస్తున్నారు.ప్రతిపక్ష పార్టీలన్నీ ఖాళీఅయి గులాబీ బాట పడుతున్నాయి.

నవతెలంగాణ : చివరిగా ప్రజలకు మీరు ఇచ్చే సందేశం?

పుట్ట మధు: నియోజకవర్గ ప్రజలు పుట్ట మధు గతం ఏంటి. ప్రస్తుతం ఏమిటి అనే చర్చ చేయాలి.ఇది వాస్తవమా.. అవాస్తవమా గ్రహించాలి.ఒక కుటుంబానికి ఓటు వేస్తే ఏం కోల్పోయామని గుర్తించాలి. ఓటు అనేగొప్ప ఆయుధాన్ని సరిగా వాడితేనే అంబేద్కర్ కలలు సహకారం అవుతాయి. బీఆర్ఎస్ సర్కార్ చేసింది,చేస్తున్నది చూసి ఓటేయ్యాలి.మాయ మాటలు విని మోసపోవద్దు... అభివృద్ధి సంక్షేమానికి పట్టం కట్టాలి. మరోసారి కేసీఆర్‌ను ముఖ్యమంత్రిని చేయాలి.

కాంగ్రెస్ నాయకుల ప్రచారం

నవతెలంగాణ-రామగిరి



ప్రచార నిర్వహిస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

మండలంలోని లొంకకేసారం గ్రామంలో సోమవారం మంథని ఎమ్మెల్యేగా శ్రీధర్ బాబును గెలిపించాలని కాంగ్రెస్ నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారంటీలను ప్రజలకు వివరించారు. తెలంగాణ బడుగు, బలహీన వర్గాల ప్రజల అభివృద్ధి, రాష్ట్రంలోని పేద ప్రజలకు అండగా కాంగ్రెస్ పార్టీ ఉంటుందన్నారు. కాంగ్రెస్ పార్టీ చేతి గుర్తుకు ఓటు వేసి మంథని ఎమ్మెల్యేగా శ్రీధర్ బాబు ను గెలిపించాలని ఓటర్లను కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కన్నూరి శ్రీనివాస్, నాంసాని సందీప్, శ్రీనివాస్, కొమురయ్య, గెల్లు క్రాంతి, బోయిని శ్రీధర్, కిరణ్ యాదవ్‌లు పాల్గొన్నారు.

కృష్ణవేణిలో ఎస్ఎల్ఏసీ లీడ్ కార్యక్రమం

నవతెలంగాణ-గోదావరిఖని:



ప్రయోగాలను పరిశీలిస్తున్న కృష్ణవేణి డైరెక్టర్

గోదావరిఖని మార్కండేయ కాలనీలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో ఎల్ఎల్ఏసీ లీడ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా డైరెక్టర్ మంజుల శ్రీనివాస్ రెడ్డి హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ప్రాథమిక విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని వారి సృజనాత్మకతను బయటికి తీసి, ప్రయోగాత్మకమైన కార్యక్రమాలను నిర్వహించారు.కార్యక్రమంలో లీడ్ అధికారి ఐశ్వర్య, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులున్నారు.

మూడో రోజు నామినేషన్లు నిల్

రామగుండం రిటర్నింగ్ అధికారి జె.అరుణశ్రీ

నవతెలంగాణ-గోదావరిఖని:



రిటర్నింగ్ అధికారి అరుణశ్రీ

సోమవారం రామగుండం అసెంబ్లీ నియోజకవర్గంలో అభ్యర్థులు ఎవరూ కూడా నామినేషన్‌లు దాఖలు చేయలేదని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు), రామగుండం నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి జె.అరుణశ్రీ ఒక ప్రకటనలో తెలిపారు. రామగుండం నియోజకవర్గ పరిధిలో మొదటిరోజు రెండు, రెండో రోజు రెండు నామినేషన్లు దాఖలు కాగా, మూడోరోజు నాడు నామినేషన్లు దాఖలు కాలేదని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధిగా బెంద్రం రాజిరెడ్డి

నవతెలంగాణ-గోదావరిఖని:



నియామకపు ఉత్తర్వులు అందజేస్తున్న మక్కాన్‌సింగ్

కాంగ్రెస్ పార్టీ పెద్దపల్లి జిల్లా అధి కార ప్రతినిధిగా బెంద్రం రాజిరెడ్డిని నియమిస్తూ సోమవారం కాంగ్రెస్ పార్టీ పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ నియామకపు ఉత్తర్వులు అందజేశారు. కాంగ్రెస్ పార్టీలో క్రియా శీలకంగా వ్యవహరిస్తున్నందుకు గాను ఆయనకు ఈ పదవి అప్పగించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా బెంద్రం రాజిరెడ్డి మాట్లా డుతూ రామగుండంలో కాంగ్రెస్ గెలుపు కోసం కృషి చేస్తానని తెలిపారు.

రామగుండంకు మహిళా నాయకత్వం అవసరం ఉంది

రామగుండం బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి కందుల సంధ్యారాణి

నవతెలంగాణ-గోదావరిఖని:



ప్రచారం నిర్వహిస్తున్న కందుల సంధ్యారాణి

రామగుండం నియోజకవర్గానికి మహిళా నాయకత్వం ఎంతో అవసరమని రామగుండం బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి కందుల సంధ్యారాణి ప్రజలకు పిలుపు నిచ్చారు. 41వ డివిజన్ హనుమాన్ నగర్‌లోని మహిళలతో ఆమె ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సంధ్యారాణి మాట్లాడుతూ కేంద్రం అందిస్తున్న ఉచిత రేషన్ పథకాన్ని మరో ఐదేళ్లు పొడిగించనున్నట్లు ప్రధానమంత్రి నరేంద్రమోదీ తెలిపారని, దీని ద్వారా 80 కోట్ల మంది ప్రజలు లబ్ధి పొందుతారని, అన్ని వర్గాలకు ఉచిత బియ్యం అందుతుందని అన్నారు. అనంతరం పార్టీలో చేరిన మహిళలకు కండు వాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు కొండపర్తి సంజీవ్, తదితరులు పాల్గొన్నారు.

కవులన్నా... కళాకారులన్న కేసీఆర్ అభిమానం

రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్

నవతెలంగాణ-గోదావరిఖని:



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోరుకంటి చందర్

కవులన్నా, కళాకారులన్న సీఎం కేసీఆర్‌కు ఎనలేని అభిమానం, గౌరవమని అందుకే రాష్ట్ర ఆవిర్భావం తరువాత సాంస్కృతిక సారథి పేరిట కళాకారులకు ఉద్యోగాలు కల్పించారని బీఆర్ఎస్ పార్టీ రామగుండం నియోజకవర్గ అభ్యర్థి, ఎమ్మెల్యే కోరుకంటి చందర్ అన్నారు. ఆదివారం అర్ధరాత్రి అడ్డగుంటపల్లిలోని ఒక ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో జరిగిన రామగుండం కళాకారుల ఆత్మీయ సమ్మేళనానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాజీ ఎమ్మెల్సీ, నియోజకవర్గ ఎన్నికల ఇంచార్జ్ నారదాసు లక్ష్మణరావుతో కలిసి మాట్లాడుతూ మలిదశ తెలంగాణ ఉద్యమంలో కవులు, కళాకారులు పోషించిన పాత్ర గణనీయమైనదన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు పిటి స్వామి, మాదాసు రామ్మూర్తి, పీవీన్ అమరేందర్, తానిపర్తి గోపాలరావు, వంగ శ్రీనివాస్‌గౌడ్,పాల్గొన్నారు.

కేబుల్ టీవీ ఆపరేటర్లకు అండగా ఉంటా...

నా శ్వాస ఉన్నంతవరకు కేబుల్ టీవీ ఆపరేటర్లకు అండగా ఉంటా... కేబుల్ టీవీ రంగం తమకు అన్నం పెట్టే తల్లి లాంటిదని, ఈ రంగం ద్వారానే రాజకీయాల్లోకి వచ్చి ప్రజలకు సేవ చేసే అవకాశం కలిగిందన్నారు. సోమవారం స్థానిక మార్కండేయకాలనీలోని శ్రీ లక్ష్మీ ఫంక్షన్ హాల్‌లో రామగుండం నియోజకవర్గ కేబుల్ టీవీ అసోసియేషన్ ఆత్మీయ సమ్మేళన కార్యక్రమంలో మాట్లాడుతూ... తాము ఎమ్మెల్యేగా పోటీ చేసిన ప్రతి సందర్భంలో రామగుండం నియోజకవర్గంలోని కేబుల్ టీవీ ఆపరేటర్ అండగా నిలిచారని అన్నారు. కేబుల్ టీవీ ఆపరేటర్ లకు ప్రభుత్వం నుంచి వచ్చే పథకాల్లో మొదటి ప్రాధాన్యతను కల్పిస్తామని చెప్పారు. కార్యక్రమంలో రామగుండం నగర మేయర్ డాక్టర్ బంగి అనిల్ కుమార్, డిప్యూటీ మేయర్ నడిపెల్లి అభిషేక్ రావు, నాయకులు కౌశికహరి, కేబుల్ టీవీ అసోసియేషన్ అధ్యక్షుడు మంథని సంపత్ కుమార్, కార్పొరేటర్లు ఇంజపురి పులిందర్, దాతు శ్రీనివాస్, బాలరాజ్‌కుమార్, మీసాల సతీష్, గౌస్ పాషా తదితరులున్నారు.

అవినీతి రహిత పాలన అందిస్తా

మాజీ ఎమ్మెల్యే, రామగుండం స్వతంత్ర అభ్యర్థి సోమారపు

నవతెలంగాణ-గోదావరిఖని:



మాట్లాడుతున్న సత్యనారాయణ

రాష్ట్రంలో, కేంద్రంలో ఏ ప్రభుత్వం ఉన్నా నిధులు తీసుకొచ్చి రామగుండంను అభివృద్ధి చేసే సత్తా తనకు ఉందని, రామగుండంలో అవినీతి రహిత పాలన అందిస్తానని మాజీ ఎమ్మెల్యే, రామగుండం స్వతంత్ర అభ్యర్థి సోమారపు సత్యనారాయణ అన్నారు. రామగుండం కార్పొరేషన్ 42,48వ డివిజన్లలోని కళ్యాణ్‌నగర్, అడ్డగుంటపల్లి, మేదరబస్తీలలో సోమారపు సత్యనారా యణ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళ్యాణ్ నగర్ రోడ్లు ఎంత అధ్వాన పరిస్థితి ఉండేదో వ్యాపారులకు తెలుసునని, తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు కళ్యాణ్ నగర్, లక్ష్మీనగర్ రోడ్లను వెడల్పు చేయించానని, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ సిస్టం ఏర్పాటు చేయించానని, సెంట్రల్ లైటింగ్ సిస్టం, వాహనాలకు పార్కింగ్ సదుపాయం కల్పించానని అన్నారు. ఈ కార్యక్రమంలో సోమారపు అరుణ్ లావణ్య, మాజీ మేయర్ రాజమణి, కుసుమ, హేమలత, గోషిక సత్యం, మెరుగు శ్యామ్‌రాజ్, శ్రీనివాస్, శంకరయ్య, రవి, శివకుమార్, మల్లేశం, సంపత్, కమలాకర్, రాజకుమార్ తదితరులున్నారు.

ఘనంగా నల్ల మనోహర్ రెడ్డి జన్మదిన వేడుకలు

నవ తెలంగాణ -సుల్తానాబాద్ రూరల్

సమాజ సేవకుడు నల్ల ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు, పెద్దపల్లి నియోజకవర్గ స్వతంత్ర ఎమ్మెల్యే అభ్యర్థి నల్ల మనోహర్ రెడ్డి జన్మదిన వేడుకలు అభిమానులు ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన నను గజమాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. మనోహర్‌రెడ్డి తన అభిమానుల మధ్యలో కేక్‌కట్ చేసి వేడుకలు నిర్వహించిన అభిమానులకు కృతజ్ఞతలు తెలియజేశారు.నల్ల మనోహర్ రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించుకొని అసెంబ్లీకి పంపుతామని అన్నారు.

రైల్వే కాంట్రాక్టు కార్మికులను ఆదుకుంటాం

మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్



కాంట్రాక్టు కార్మికులతో మాట్లాడుతున్న మక్కాన్‌సింగ్

నవతెలంగాణ-రామగుండం

రైల్వేలో కాంట్రాక్టు ప్రాతిపదికన పనిచేస్తున్న కార్మికుల సమస్యలు పరిష్కరించి వారిని ఆదుకుంటామని పెద్దపల్లి డీసీసీ జిల్లా అధ్యక్షుడు, కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ అన్నారు. సోమవారం ఆయన రామగుండం రైల్వే స్టేషన్‌లోని ఆర్‌వో షెడ్‌లో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులను కలిసి, వారి సమస్యలు తెలుసుకుని మాట్లాడారు. మక్కాన్‌సింగ్ మాట్లాడుతూ గతంలో కాంగ్రెస్ పార్టీ హయాంలో దేశంలోనే అత్యధికంగా ఉద్యోగాలు ఉన్న సంస్థగా రైల్వే ఉండేదన్నారు. బీజేపీ ప్రభుత్వం రైల్వేను ప్రైవేటు పరం చేస్తోందని ఆరోపించారు. తనకు ఓటు వేసి కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని ఆయన కార్మికులను కోరారు.

గర్శకుర్తిని మండల కేంద్రంగా ఏర్పాటు చేస్తాం

రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్



మాట్లాడుతున్న రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు వినోద్ కుమార్

నవతెలంగాణ - గంగాధర : గర్శకుర్తి గ్రామాన్ని బీఆర్ఎస్ ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి రాగానే మండల కేంద్రంగా ఏర్పాటు చేస్తామని రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్ కుమార్ భరోసా నిచ్చారు. గంగాధర మండలం గర్శకుర్తి గ్రామంలో నిర్వహించిన ఎన్నికల ప్రచార సభలో ఆయన మాట్లాడారు. గర్శకుర్తి గ్రామం ఇప్పటికే మండలంగా ప్రకటించాల్సి ఉన్నా సాంకేతిక కారణాలతో జాప్యమైందన్నారు. బతుకమ్మ చీరల ఆర్డర్ ను జనవరి నుండే అందించేలా చొరవ తీసుకుంటామని హామీ ఇచ్చారు. బీఆర్ఎస్ పక్షాన చొప్పదండి ఎన్నికల బరిలో నిలిచిన సౌమ్యుడు, స్థానికుడు రవిశంకర్‌ను కారు గుర్తుకు ఓట్లేసి గెలిపించాలని కోరారు. అనంతరం గర్శకుర్తి మాజీ ఎంపీటీసీ చిప్ప లావణ్యచక్రపాణి కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసి బీఆర్ఎస్ పార్టీలో చేరగా పార్టీ కండువ కప్పారు. చొప్పదండి బీఆర్ఎస్ అభ్యర్థి సుంకె రవిశంకర్, ఎంపీపీ శ్రీరాం మధూకర్, నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

గంగులను గెలిపించి కరీంనగర్‌ను మరింత అభివృద్ధి చేసుకుందాం

డిప్యూటీ మేయర్ చల్ల స్వరూపరాణి హరిశంకర్



ప్రచారం నిర్వహిస్తున్న డిప్యూటీ మేయర్

నవతెలంగాణ - కరీంనగర్

కరీంనగర్‌ను కనీవినీ ఎరుగని రీతిలో అభివృద్ధి చేసిన మంత్రి గంగుల కమలాకర్‌ను నాలుగోసారి ఎమ్మెల్యేగా గెలిపించుకొని మరింత అభివృద్ధి చేసుకుందామని డిప్యూటీ మేయర్ చల్ల స్వరూపరాణిహరిశంకర్ అన్నారు. సోమవారం 33డివిజన్‌లో గంగుల గెలుపు కోసం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కరీంనగర్‌ను ఆధ్యాత్మిక, పర్యాటక, ఆహ్లాద నగరంగా తీర్చిదిద్దుతున్నారని చెప్పారు. నగర అభివృద్ధి కోసం వేలకోట్లు నిధులు తీసుకొచ్చిన ఘనత గంగుల కమలాకర్‌కే దక్కిందన్నారు. ప్రతి ఒక్కరూ కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

ప్రజల్లో విశ్వాసాన్ని కల్పించేలా విధులు నిర్వర్తించాలి

కరీంనగర్ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పమేలా సత్పతి



నవతెలంగాణ-కరీంనగర్

ఈ నెల 30న నిర్వహించే సాధారణ ఎన్నికలు నైతిక విలువలతో జరగనున్నాయనే నమ్మకాన్ని, విశ్వాసాన్ని ప్రజలకు కల్పించేలా ఎన్నికల విధులను నిర్వర్తించాలని కరీంనగర్ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పమేలా సత్పతి సూచించారు. సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో సీపీ, ఆర్వోలతో కలిసి వివిధ విభాగాల ఎన్నికల నోడల్ అధికారులకు ఎన్నికల విధులపై దిశా నిర్దేశనం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఎన్నికల ప్రకటన జారీ అయినప్పటి నుంచి మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్‌కు భంగం కలగకుండా కట్టుదిట్టంగా వ్యవహరించాలని అన్నారు. సీ విజిల్, సువిధలో వచ్చే ఫిర్యాదులు, దరఖాస్తులపై తీసుకునే చర్యల్లో ఎలాంటి ఆలస్యం జరగరాదని, ఎక్కడ ఎలాంటి సంఘటనలు జరగకుండా పకడ్బందీగా వ్యవహరించాలన్నారు. జిల్లాలో ఎక్కడ మద్యం, నగదు, బహుమతుల పంపిణీ జరగకుండా కట్టుదిట్టంగా వ్యవహరించాలని, జిల్లా వ్యాప్తంగా బెల్ట్ షాపులను పూర్తిగా తొలగించాలని ఆదేశించారు. జిల్లాలో ఏర్పాటు చేసిన చెక్ పోస్టుల మీదుగా వెళ్లే ప్రయివేటు వాహనాలతో పాటు అన్ని ప్రభుత్వ వాహనాలను, అంబులెన్స్, పోలీస్, రెవిన్యూ వాహనాలను తనిఖీ చేయాలన్నారు. మన విధులను మరొకరు గుర్తు చేయాల్సిన అవసరం రానివ్వకుండ, బాధ్యతాయుతంగా వ్యవహరించాలని అన్నారు. ఫిర్యాదు ఏ విధంగా అందినా వాటిపై తక్షణం స్పందించాలని, మనం నిర్వర్తించే విధులపై ఆత్మ పరిశీలన చేసుకొని నైతిక విలువలతో కూడిన ఎన్నికలు జరిగేలా చూడాలన్నారు. ఫిర్యాదులు ఇచ్చే వారి వివరాలను గోప్యంగా ఉంచాలని ఆదేశించారు. వాహనాలలో తనిఖీ సమయంలో వీడియో రికార్డ్ ఖచ్చితంగా చేయాలన్నారు. సీపీ అభిషేక్ మొహంతి మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో ఎన్నికల ప్రవర్తన నియమావళిని ఉల్లంఘించిన రాజకీయ పార్టీలపై మాత్రమే కాకుండా విధుల నిర్వహణలో ఏదైన రాజకీయ పార్టీకి అనుకూలంగా వ్యవహరించిన సిబ్బందిపై ఆర్‌పీ ఆక్ట్ 128 ప్రకారం, విధులలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన సిబ్బందిపై ఆర్పీ ఆక్ట్ 134 ప్రకారం కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. ఎన్నికల ప్రవర్తన నియమావళికి ఎవరు మినహాయింపు కాదని, ఇప్పటికే చెక్ పోస్టులలో తగిన సిబ్బందిని నియమించడం జరిగిందని, మరో రెండు రోజులలో అదనంగా బీఎస్ఎఫ్ బలగాలు రానున్నాయని, వారితో మరింత పకడ్బందీగా వ్యవహరించేలా చూస్తామని చెప్పారు. సభలు, సమావేశాలకు సంబంధించి అనుమతుల జారీలో మరింత పకడ్బందీగా వ్యవహరించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్, మానకొండూర్, చొప్పదండి, హుజురాబాద్ నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు కె.మహేశ్వర్, లక్ష్మీ కిరణ్, ప్రఫుల్ దేశాయ్, ఎస్.రాజు, డీఆర్ఓ పవన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



ఓటు హక్కు తప్పక వినియోగించుకోవాలి

వికలాంగులు, వృద్ధులు ఓటు హక్కును తప్పక వినియోగించుకోవాలని కరీంనగర్ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. సోమవారం నగరంలోని గాంధీ రోడ్‌లో ఉన్న ప్రభుత్వ వికలాంగుల, వృద్ధుల వసతి గృహాన్ని కలెక్టర్ సందర్శించారు. 80ఏండ్ల వయసు పైబడిన వృద్ధులు, పోలింగ్ స్టేషన్ వరకు వెళ్లలేని వికలాంగుల కోసం ఎన్నికల కమిషన్ ఇంటి నుంచే ఓటు హక్కు వినియోగించుకునే వీలు కల్పించిందని చెప్పారు. అందుకు అర్హత ఉన్న వారంతా '12 డి' ఫారం నింపాలని తెలిపారు. ఇందుకు ప్రభుత్వ అధికారులు, బీఎల్వోలు సహకరిస్తారని తెలిపారు. ప్రభుత్వ వికలాంగుల, వయోవృద్ధుల వసతి గృహంలో ఉన్న ఓటర్లు తప్పక ఓటు హక్కు వినియోగించుకునేలా అన్ని సదుపాయాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి, అడిషనల్ డీఆర్డీఓ సంధ్యారాణి, డీఎస్ టీడీఓ రాజేశ్వరి, ఎఫ్ఆర్ఓ స్వర్ణలత, వార్డెన్ రాధిక పాల్గొన్నారు.

నిజాయితీగా ఓటును వినియోగించుకోవాలి

భారత రాజ్యాంగంచే కల్పించబడిన ఓటు హక్కును డబ్బు, బహుమతి తదితర ప్రలోభాలకులోను కాకుండా నిజాయితీగా వాడుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. జిల్లా కేంద్రంలోని స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ఆడిటోరియంలో స్వీప్ ఓటు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ శ్రీలక్ష్మి, పీడీ మెప్మా బి.రవీందర్, అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కోడ్ ఉల్లంఘించిన వారిపై చర్య తీసుకోవాలి

రిటర్నింగ్ అధికారికి డీవైఎఫ్ఐ నాయకుల ఫిర్యాదు

నవతెలంగాణ - కోల్‌సిటీ



అసెంబ్లీ ఎన్నికల నిబంధనలను ఉల్లంఘించి, కారు గుర్తుకు ఓటు వేయాలని విద్యాసంస్థ ఆవరణలో ప్రచారం చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని భారత ప్రజాతంత్ర యువజన సమైక్య డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు కొంటుసాగర్, నాయకులు మొగిలిచర్ల సురేష్, అట్ల శివకుమార్ రిటర్నింగ్ ఆఫీసర్ అరుణశ్రీకి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా కొంటు సాగర్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ఎలక్షన్ కమిషన్ నిబంధనలు, విద్యాహక్కు చట్టంప్రకారం ఏ రాజకీయ పార్టీ నాయ కులు ప్రచారం విద్యాసంస్థల ఆవరణలో నిర్వహించకూడదన్నారు. ఈ నిబంధనలను ఉల్లంఘిస్తూ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి కోరుకంటి చందర్‌కు ఓటు వేయాలని రామగుండం సింగరేణి మెడికల్ కళాశాల ప్రాంగణంలో వీడియోలు చిత్రీకరించి సోషల్ మీడియాలో పోస్టు చేయడం ఎన్నికల నియమావళికి విరుద్ధమ న్నారు. ప్రభుత్వ విద్యా సంస్థలను సొంత ప్రయోజనాలకు వినియో గించిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఎన్నికలు సజావుగా జరిగేందుకు సహకరించాలి

అడిషనల్ డీసీపీ లక్ష్మీనారాయణ



ఫ్లాగ్ మార్చ్‌ను ప్రారంభిస్తున్న అడిషనల్ డీసీపీ

నవతెలంగాణ - వీణవంక : ఎన్నికలు సజావుగా జరిగేందుకు ప్రజలు సహకరించాలని అడిషనల్ డీసీపీ లక్ష్మీనారాయణ సూచించారు. మండల కేంద్రంలో ఏసీపీ జీవన్‌రెడ్డి, బీఎస్ఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ అనూజ్ కుమార్, సీఐ రమేష్, ఎస్సై ఎండీ ఆసిఫ్‌తో పాటు బీఎస్ఎఫ్ జవాన్లతో కలిసి సోమవారం ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని ప్రధాన రహదారుల గుండా బీఎస్ఎఫ్ జవాన్లతో కవాత్ నిర్వహించారు. అనంతరం బస్టాండ్ వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన అడిషనల్ డీసీపీ మాట్లాడారు.

కోడ్ ఉల్లంఘించిన వారిపై చర్యలకు

కలెక్టర్‌కు సిఫార్సు చేసిన రిటర్నింగ్ అధికారి

నవతెలంగాణ - కోల్‌సిటీ : రామగుండం నియోజకవర్గ పరిధిలోని సింగరేణి మెడికల్ కళాశాల ప్రాంగణంలో ఫేక్‌ఐడీ కార్డులు ధరించి స్థానిక రాజకీయ పార్టీకి ఓటు వేయాలని వీడియోలు తీసి వాటిని వే టూ ఎస్ఎంఎస్, ఇన్ స్టాగ్రామ్ రీల్స్ ద్వారా పోస్టులు చేసిన ఘటనపై రామగుండం ఎన్నికల అధికారి స్పందించారు. ఫేక్ ఐడీ కార్డులు ధరించిన వారిని కళాశాల ప్రాంగణంలోకి అనుమతించడం, వీడియో షూట్‌కు అనుమతి ఇవ్వడంపై చర్యలు ప్రారంభించారు. దీనికి బాధ్యులైన ఔట్‌సోర్సింగ్ సిబ్బంది, సెక్యూరిటీస్టాఫ్, శానిటేషన్ సూపర్‌వైజర్‌ల ను ఉద్యోగం నుంచి తొలగించాలని జిల్లా కలెక్టర్‌కు సిఫార్సు చేసినట్లు అదనపు కలెక్టర్, రామగుండం రిటర్నింగ్ ఆఫీసర్ జె.అరుణశ్రీ తెలిపారు.

అభివృద్ధిని చూసి ఆశీర్వదించండి

నవతెలంగాణ -పెగడపల్లి


ప్రచారం చేస్తున్న బిఆర్ఎస్ నాయకులు

అభివృద్ధిని చూసి కొప్పుల ఈశ్వర్‌ను ఆశీర్వదించాలని మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ లోక నిర్మల అన్నారు. పెగడపల్లి మండల పరిధిలోని ల్యాగలమర్రి గ్రామాల్లో ఇంటింటికి తిరుగుతూ ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ మంత్రి వేణు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ రాజు ఆంజనేయులు, సర్పంచ్ ఉమ్మెంతల వనజ, కోరుకంటి రాజేశ్వర్‌రావు, ఎంపీటీసీలు మంద పల్లి అంజయ్య, గుర్రం స్వాతి, పార్టీ సీనియర్ నాయకుడు గోలి సురేందర్‌రెడ్డి, మాజీ మార్కెట్ చైర్మన్ నగావత్ తిరుపతి నాయక్ బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు లోక మల్లారెడ్డి పాల్గొన్నారు.

మేడిపల్లి, కొండాపూర్ గ్రామాల్లో ఆది శ్రీనివాస్ ప్రచారం

నవతెలంగాణ-మేడిపల్లి


ఓటర్లను అభ్యర్థిస్తున్న ఆది శ్రీనివాస్

మేడిపల్లి మండల కేంద్రంతో పాటు కొండాపూర్ గ్రామంలో కాంగ్రెస్ పార్టీ వేములవాడ ఎమ్మెల్యే అభ్యర్థి ఆది శ్రీనివాస్ ప్రచారం నిర్వహించారు. అధికారంలోకి వస్తే కాంగ్రెస్ అమలు చేస్తే ఆరు గ్యారంటీలను ప్రజలకు వివరించారు. ఈ కార్య క్రమంలో భీమారం మండల అధ్యక్షుడు సింగిరెడ్డి నరేష్‌రెడ్డి, మేడిపల్లి మండలాధ్యక్షుడు ఏనుగు రమేష్‌రెడ్డి, గడ్డం జలంధర్‌రెడ్డి, నాగరాజు, మాజీ ఎంపీటీసీ దాసరి శంకర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అజీమ్, జిల్లా కార్యవర్గ సభ్యులు ఉరుమడ్ల లక్ష్మణ్, కాంగ్రెస్ శ్రేణులు పాల్గొన్నారు.

బిఆర్ఎస్‌లో చేరికలు


బిఆర్ఎస్‌లో చేరిన ఎంపిటిసి గాజుల మల్లేశం

నవతెలంగాణ -ఎండపల్లి

మండలంలోని రాజారాంపల్లి ఎంపీటీసీ, బీజేపీ జగిత్యాల జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు గాజుల మల్లేశం సోమవారం సిరిసిల్లలో మంత్రి కొప్పుల ఆధ్వర్యంలో బీఆర్ఎస్‌లో చేరగా వారికి మంత్రి కేటీఆర్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు చంద్రారెడ్డి, ఎండపల్లి సర్పంచ్ జలంధర్‌రెడ్డి, చిట్టిపటేల్, సంఘ రమేష్, జానీ,గొల్లపెల్లి మల్లేశం,గంగరాజు, విజయ్ మోహన్‌రెడ్డి, అనిల్ రెడ్డి తదితరులు పాల్గున్నారు.

సుంకె సమక్షంలో పలువురి చేరిక



నవతెలంగాణ- మల్యాల

మల్యాల మండల కేంద్రంతో పాటు బాల్వంతాపూర్, లంబాడిపల్లె గ్రామాలకు చెందిన యువకులు ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. వారికి ఎమ్మెల్యే కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ కొండపల్కల రాంమోహన్‌రావు, సర్పంచ్ ఫోరమ్ అధ్యక్షుడు మిట్టపెల్లి సుదర్శన్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు జనగం శ్రీనివాస్, పీఏసీఎస్ చైర్మన్ ముత్యాల రాములింగారెడ్డి పాల్గొన్నారు.

వ్యాధులు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

జిల్లా ఉప వైద్యాధికారి డాక్టర్ శ్రీనివాస్

నవతెలంగాణ- పెగడపల్లి


మాట్లాడుతున్న జిల్లా ఉప వైద్యాధికారి డాక్టర్ శ్రీనివాస్

అంటువ్యాధులు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా ఉపవైద్యాధికారి డాక్టర్ శ్రీనివాస్ అన్నారు. పెగడపల్లి మండల పరిధిలోని ఆరవెల్లి గ్రామంలోని హెల్త్ సెంటర్‌ను సోమవారం జిల్లా ఉపవైద్యాధికారి శ్రీనివాస్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రోజువారీగా నమోదు చేస్తున్న ఊపిరి పరిశీలించిన అనంతరం డాక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ.. గర్భిణుల నమోదు 100శాతం చేయాలన్నారు. పిల్లలకు రోగ నిరోధక టీకాలు అందిం చాలని, బీసీ, డయాబెటిక్ పేషెంట్లకు మందులు అందించాలని సూచించారు. ఆయన వెంట మెడికల్ ఆఫీసర్ డాక్టర్ నరేష్, డాక్టర్ రమ, సూపర్ వైజర్ శ్రీనివాస్, ఏఎన్ఎంలు ఆశావర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

రాజక్కపల్లిలో బీఆర్ఎస్ నాయకుల ప్రచారం


పథకాలను వివరిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

నవతెలంగాణ-వెల్గటూర్

మండలంలోని రాజక్కపల్లిలో బీఆర్ఎస్ నాయకులు ఇంటింటికీ తిరుగుతూ ప్రచారం నిర్వహించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో వెల్గటూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పత్తిపాక వెంకటేష్, గ్రామ సర్పంచ్ బోడకుంటి రమేష్, గ్రామ శాఖ అధ్యక్షుడు ఎర్రోళ్ల సతీష్, ఉప సర్పంచ్ మోత్కూరి మంగ శేఖర్, బి ఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి మర్రి పోచయ్య,వార్డు సభ్యులు పాల్గొన్నారు.

క్రైస్తవ వెల్ఫేర్ అసోసియేషన్ ఆత్మీయ సమ్మేళనం

నవతెలంగాణ-ధర్మపురి


మాట్లాడుతున్న మంత్రి కొప్పుల ఈశ్వర్

ధర్మపురి మండల కేంద్రంలోని స్థానిక ఎస్‌హెచ్ గార్డెన్‌లో క్రైస్తవ వెల్ఫేర్ అసోసియేషన్ ఆత్మీయ సేవకుల సహవాసం (క్రైస్తవ ఆత్మీయ సమ్మేళనం) సోమవారం నిర్వహించారు. మంత్రి కొప్పుల ఈశ్వర్ పాల్గొని మాట్లాడారు. తెలంగాణ ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమానికి పెద్దపీట వేసిందన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా వారి సంక్షేమానికి కృషి చేస్తోందన్నారు. ఈ సమావేశంలో డీసీఎంఎస్ చైర్మన్ ఎల్లాల శ్రీకాంత్ రెడ్డి, జడ్పీటీసీ బత్తిని అరుణ, వివిధ చర్చల పాస్టర్లు పాల్గొన్నారు.


పోలింగ్ కేంద్రం పరిశీలిస్తున్న డీఎస్పీ రవీందర్‌రెడ్డి

ఎన్నికలు సజీవుగా జరిగేలా చర్యలు తీసుకోవాలి

మెట్‌పల్లి డీఎస్పీ రవీందర్‌రెడ్డి

నవతెలంగాణ-ఇబ్రహీంపట్నం

ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు సజావుగా జరిగేలా చర్యలు తీసుకోవాలని మెట్‌పల్లి డీఎస్పీ రవీందర్‌రెడ్డి సూచించారు. ఇబ్రహీంపట్నం మండల కేంద్రంతో పాటు వర్షకొండ, ఎర్దండి, యమపూర్ గ్రామాలోని సమస్యాత్మకమైన పోలింగ్ కేంద్రాలను సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ.. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. ఆయన వెంట ఎస్ఐ ఉమాసాగర్ ఉన్నారు.

వివిధ గ్రామాలను నుంచి బీఆర్ఎస్‌లో చేరికలు



నవతెలంగాణ- మల్యాల

మల్యాల, బల్వంతపూర్, లంబాడిపల్లితో పాటు వివిధ గ్రామాలకు చెందిన కాంగ్రెస్, బీజేపీ కార్యకర్తలు 500మంది బీఆర్ఎస్ అభ్యర్థి సుంకె రవిశంకర్ సమక్షంలో పార్టీలో చేరారు.

బీఆర్ఎస్‌లో చేరిన కాచారం యువకులు



నవతెలంగాణ-మేడిపల్లి

మేడిపల్లి మండలం కాచారం గ్రామానికి చెందిన యువకులు సుమారు 40 మంది బీఆర్ఎస్‌లో చేరగా వేములవాడ బీఆర్ఎస్ అభ్యర్థి చల్మెడ లక్ష్మీ నరసింహారావు వారికి కుండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్ చైర్మన్ లోకబాపు రెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ కొప్పర లింగారెడ్డి, గ్రామ సర్పంచ్ చిట్యాల సురేష్, ఉపసర్పంచ్ సాయి కృష్ణ, మాజీ సర్పంచ్ జలంధర్ రెడ్డి,గ్రామ శాఖ అధ్యక్షుడు సురకంటి రవి పాల్గొన్నారు.

ఇంటింటికీ బీఆర్ఎస్ ప్రచారం

నవతెలంగాణ-మేడిపల్లి

భీమారం మండలంలోని ఈదుల లింగంపేట గ్రామంలో గడ పగడపకు బీఆర్ఎస్ నాయకులు ప్రచారం నిర్వహించారు. చల్మెడ లక్ష్మి నరసింహారావు మద్దుతు మండల సర్పంచుల పురం అధ్యక్షుడు గ్రామ సర్పంచ్ వంగ వెంకటేశం ఆధ్వర్యంలో ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కంచి శంకర్, బీఆర్ఎస్ శ్రేణులు పాల్గొన్నారు.



మహిళ మేడలో నుంచి పుస్తెల తాడు చోరీ

నవతెలంగాణ-వెల్గటూర్

వెల్గటూర్ మండల కేంద్రంలోని ఓ మహిళ ఇంట్లో పూజ చేస్తున్న సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు ఇంట్లో చొరబడి మహిళ కళ్ళలో మట్టి కొట్టి మేడలో ఉన్న పుస్తెలా తాడు అపహరించిన ఘటన సోమవారం చోటు చేసుకుంది. మండల కేంద్రానికి చెందిన గారిమెల్లా సురేష్ రోజు లాగా షాపుకు వెళ్లారు. భర్య సౌజన్య ఇంట్లో ఒంటరిగా ఉండి పూజ చేస్తున్న సమయంలో ఇంట్లోకి చొరబడి మహిళ కళ్ళలో మట్టి కొట్టి రెండు తులాల పుస్తెలా తాడు ఎత్తుకువెళ్ళాడు. పోలీసులుకు సమాచారం అందించడం ఎస్సై స్వేతా కేసు నమోదు చేసి విచారణ చేపడుతున్నారు.

ఓటుపై అవగాహన



ర్యాలీ తీస్తున్న మున్సిపల్ సిబ్బంది

నవతెలంగాణ-కోరుట్ల

కోరుట్ల పట్టణ పేదరిక నిర్మూలన (స్వీప్) సంస్థ ఆధ్వర్యంలో మున్సిపల్ సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ రాజేశ్వర్ మాట్లాడుతూ.. ఓటు హక్కు అందరూ వినియోగించుకోవాలని సూచించారు. సివిజిల్ యాప్ ద్వారా ఎన్నికలలో జరిగే అక్రమాలపై ఫిర్యాదు చేయవచ్చు అని తెలిపారు. ఈ కార్యక్రమంలో మెప్మా ఏవో శ్రీనివాస్‌గౌడ్, డీఎంసీ సునీత, ఇన్‌చార్జి టీఎంసీ సంధ్య, సీవో శివ, మెప్మా రిసోర్స్ పర్సన్స్, మహిళ సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

ఆరు గ్యారంటీలను అమలు చేస్తాం

నవతెలంగాణ-జగిత్యాల టౌన్

అధికారంలోకి వచ్చిన వెంటనే ఆరు గ్యారంటీలను అమలు చేస్తామని ఎమ్మెల్సీ, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి జీవన్‌రెడ్డి అన్నారు. జగిత్యాల మున్సిపల్ పరిధిలోని 10 వార్డు లింగంపేటకు చెందిన బీఆర్ఎస్, బీజేపీల నుంచి 150 మంది మహిళలు కాంగ్రెస్‌లో చేరారు. వారికి కండువా కప్పి పార్టీలోకి జీవన్‌రెడ్డి ఆహ్వానించారు.

బీఆర్ఎస్‌లో చేరిన ముదిరాజ్ సంఘం నాయకులు


కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న కొప్పుల

నవతెలంగాణ-ధర్మపురి

ధర్మపురి పట్టణంలో మంత్రి కొప్పుల ఈశ్వర్ సమక్షంలో ముదిరాజ్ సంఘం సభ్యులు 100 మంది బీఆర్ఎస్‌లో చేరగా వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధిని వారికి వివరించారు.

బీఆర్ఎస్‌లో చేరిన యువకులు

నవతెలంగాణ-మెట్‌పల్లి

మెట్‌పల్లి పట్టణానికి చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, సోమవారం ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు, ఎమ్మెల్యే అభ్యర్థి సంజయ్ సమక్షంలో బిఆర్ఎస్ చేరారు. వారికి ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

ఇండిపెండెంట్‌గా నామినేషన్ వేసిన రాజేందర్

నవతెలంగాణ-కోరుట్ల



నామినేషన్ వేస్తున్న రాజేందర్

కోరుట్ల నియోజకవర్గంలో ఎమ్మెల్యేగా పోటీ చేయడానికి ఇండిపెం డెంట్‌గా ఆరె రాజేందర్ సోమవారం నామినేషన్ దాఖలు చేశారు. కోరుట్ల నియోజకవర్గంలో ఇప్పటి వరకు మూడు నామినేషన్‌లు వేసినట్టు ఆర్డీవో తెలిపారు.

వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

నవతెలంగాణ-జూలపల్లి


కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న సహకార సిబ్బంది

జూలపల్లి మండలంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం జూలపల్లి వారి ఆధ్వర్యంలో కోనరావుపేట, కుమ్మరి కుంట,పెద్దాపూర్ గ్రామాలలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను సహకార సిబ్బందితో సీఈవోసురేష్ ప్రారంభించారు. సురేష్ మాట్లాడుతూ తేమశాతం 17 శాతం ఉండే విధంగా రైతులు తాలు, తప్ప లేకుండా చూసుకోవాలని గ్రేడ్ ఏ రకం 2203గా, సాధారణరకం 2183గా ధరలు ఉన్నాయని, దళారులను నమ్మి మోసపోకుండా కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యాన్ని అమ్ముకోవాలని అన్నారు.

ఆరు గ్యారంటీలతో ప్రజలకు భరోసా

ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు

నవతెలంగాణ-మంథని


కండువా కప్పిలోకి ఆహ్వానిస్తున్న శ్రీధర్‌బాబు

తెలంగాణ రాష్ట్ర ప్రజలకు కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారెంటీ పథకాలు ప్రజలకు ఎంతో భరోసానిస్తున్నాయని మంథని కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి శ్రీధర్ బాబు అన్నారు. సోమవారం బీఆర్ఎస్ పార్టీ నుంచి మాజీ ఎంపీపీ నారమళ్ల లక్ష్మీరాజంతో 100 మందికి పైగా మహిళలు,నాయకులు కాంగ్రెస్ పార్టీ చేరారు.వారికి శ్రీధర్ బాబు పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా శ్రీధర్ బాబు మాట్లాడుతూ తెలంగాణ ఇచ్చిన సోనియా గాంధీ రుణం తీర్చుకునే సమయం ఆసన్నమైందని పేర్కొన్నారు.

ప్రధాన అభ్యర్థులు అభివృద్ధిపై ఎజెండా ప్రకటించాలి

నవతెలంగాణ-మంథని


మాట్లాడుతున్న కొండెల మారుతి

పోటీ చేసే ప్రధాన పార్టీల అభ్యర్థులు మంథని అభివృద్ధిపై ప్రణాళిక విడుదల చేసి, ప్రధాన అభ్యర్థుల సొంత ఎజెండా ప్రకటించాలని విద్యార్థి యువత వ్యవస్థాపక అధ్యక్షుడు కొండేల మారుతి అన్నారు. మంథనిలో జరిగిన విలేకరుల సమావేశంలో మంథని విద్యార్థి యువత వ్యవస్థాపక అధ్యక్షులు కొండల మారుతి మాట్లాడుతూ మంథని శాసనసభ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు మంథని అభివృద్ధి గురించి ఎన్నికల ప్రణాళిక విడుదల చేయాలని కోరారు. మంథని ప్రాంత సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటారో వెల్లడించాలని డిమాండ్ చేశారు.

రాజకీయ మార్పు బీజేపీతోనే సాధ్యం

నామినేషన్ దాఖలు చేసిన బీజేపీ అభ్యర్థి సునీల్ రెడ్డి

నవతెలంగాణ-మంథని


మాట్లాడుతున్న సునీల్ రెడ్డి

పెద్దపల్లి జిల్లా మంథని పట్టణంలో బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి చంద్రుపట్ల సునీల్ రెడ్డి సోమవారం పట్టణంలోని బిక్షేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు అనంతరం తన నామినేషన్ పత్రాలను మాజీ ఎమ్మెల్యే చంద్రుపట్ల రాంరెడ్డితో కలసి మంథని ఎన్నికల రిటర్నింగ్ అధికారి, మంథని ఆర్డీవో హనుమా నాయక్‌కు నామినేషన్ పత్రాలు సమర్పించారు. అనంతరం సునీల్ రెడ్డి మాట్లాడుతూ మంథనిలో రాజకీయ మార్పు జరగాలని,ఆ మార్పు బీజేపీ పార్టీతోనే సాధ్యమన్నారు. గత 20 సంవత్సరాలుగా ఈ ప్రాంతంలో అన్నీ వనరులు ఉన్నప్పటికీ అభివృద్ధి చెందలేకపోవడం బాధాకరమన్నారు. ఈ కార్యక్రమంలో అసెంబ్లీ కన్వీనర్ మల్క మోహన్ రావు, రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ కొండపాక సత్య ప్రకాష్, జిల్లా అధికార ప్రతినిధి పోతార వేణి క్రాంతికుమార్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ పార్టీలో భారీగా చేరికలు

నవతెలంగాణ-మంథని


పార్టీలోకి ఆహ్వానిస్తున్న పుట్టమధు

మంథని నియోజకవర్గంలోని మహదేవ్‌పూర్, మహాముత్తారం, పలిమల, కాటా రం, మంథని, రామగిరి,ముత్తారం, మల్హర్ పలు మండలాల నుంచి వివిధ పార్టీల చెందిన నాయకులు పెద్దపల్లి జెడ్పీ ఛైర్మన్, బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి పుట్ట మధూకర్ సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధిని చూసి బీఆర్ఎస్‌లోకి రావడం జరిగిందని, పుట్ట మధుకు అండగా నిలిచి ఆయన గెలుపు కోసం పనిచేస్తామని వారు తెలిపారు.

పూర్తి స్థాయిలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలి

- జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్



నవతెలంగాణ -పెద్దపల్లి

బుధవారం నాటికి జిల్లాలో పూర్తిస్థాయిలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి రైతులు పండించిన ధాన్యం చివరి గింజ వరకు మద్దతు ధరపై కొనుగోలు చేయాలని, రైతులందరికీ మద్దతు ధర అందేలా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. సోమవారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ధాన్యం కొనుగోలు అంశంలో తీసుకోవాల్సిన చర్యలపై సంబంధిత అధికారులతో సమీక్షించారు.జిల్లాలో 305 ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యం దిగుబడి మద్దతు ధరపై కొనుగోలు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకున్నామని, ఇప్పటివరకు 57 కొనుగోలు కేంద్రాలు మాత్రమే ప్రారంభించారని, వరి కోతలు వేగం పెరుగుతున్నందున వెంటనే జిల్లా వ్యాప్తంగా బుధవారం నాటికి పూర్తి స్థాయిలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలని అన్నారు. అకాల వర్షాల కారణంగా ధాన్యం నష్టపోకుండా ప్రతి ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద తప్పనిసరిగా టార్పాలిన్లు అవసరమైన మేర ఏర్పాటు చేయాలన్నారు. ధాన్యం కొనుగోలుకు రైస్ మిల్లర్ల వద్ద ఉన్న గన్ని బ్యాగుల నాణ్యత పరిశీలించాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి శ్రీధర్, సివిల్ సప్లై జిల్లా మేనేజర్ శ్రీకాంత్ రెడ్డి, జిల్లా సహకార అధికారి శ్రీమాల, వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

కళ్లముందు కనిపించే అభివృద్ధిపై ఆలోచన చేయండి

- నాయకులుగా కాదు.. సేవకులుగా పనిచేస్తాం
- మున్సిపల్ చైర్ పర్సన్ పుట్ట శైలజ

నవతెలంగాణ-రామగిరి


బీఆర్ఎస్ నాయకులతో మున్సిపల్ చైర్మన్ పుట్ట శైలజ

కంటి ముందు కన్పించే అభివృద్ధిపై ఆలోచన చేయాలని, మంథని మున్సిపల్ చైర్‌పర్సన్ పుట్టశైలజ అన్నారు. రామగిరి మండలం సెంటనరీకాలనీలో బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్‌కు ఓటు వేసి గెలిపించాలని ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, నాలుగేండ్లు ఎమ్మెల్యేగా అవకాశం కల్పిస్తే అనేక అభివృద్ధి పనులు చేసిన చరిత్ర పుట్ట మధూకందేనన్నారు. ఆనాడు ఎమ్మెల్యేగా ఈనాడు జెడ్పీ చైర్మన్‌గా నిరంతరం మంథని ప్రాంత ప్రజల సంక్షేమం కోసం కృషి చేశారన్నారు. ఒక్కసారి అవకాశం కల్పిస్తే నాయకులుగా కాకుండా మీ సేవకులుగా పనిచేశామని, ప్రతి పేద కుటుంబానికి తమవంతు సాయం అందించామన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కె.శ్రీదేవి భాస్కర్, బీఆర్ఎస్ మండల మహిళా అధ్యక్షురాలు భూక్య ఆశాకుమారితో పాటు టీబీజీకేఎస్ నాయకులు పాల్గొన్నారు.

సింగరేణి కార్మికుల సమస్యలపై పోరాటం చేస్తా

కాంగ్రెస్ రామగుండం అభ్యర్థి మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్

నవతెలంగాణ-గోదావరిఖని:


మాట్లాడుతున్న మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్

సింగరేణి కార్మికుల సమస్యలపై పోరాటం చేస్తానని కాంగ్రెస్ రామగుండం అభ్యర్థి మక్కాన్‌సింగ్ రాజ్ ఠాకూర్ అన్నారు. ఆదివారం రాత్రి గోదావరిఖనిలో ఐఎన్‌టీయూసీఆర్జీ-1 జనరల్ బాడీ సమావేశం జరిగింది. స్థానిక బృందావన్ గార్డెన్స్‌లో ఏర్పాటు చేసిన ఈ సమావేశంలో ముఖ్య అతిథులుగా రామగుండం కాంగ్రెస్ అభ్యర్థి మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్, ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్ జనక్ ప్రసాద్‌లు పాల్గొన్నారు. ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్ జనక్ ప్రసాద్ మాట్లాడుతూ రామగుండంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రాజ్ ఠాకూర్ మక్కాన్‌సింగ్ గెలుపు కోసం ఒక్కో కార్మికుడు సైనికుడిలా పని చేయా లని పిలుపునిచ్చారు. మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ మాట్లాడుతూ ఇక్కడ ప్రజలకు, కార్మికులకు ఎల్లపుడూ అండగా ఉంటానని, కాంగ్రెస్ కేంద్రం, రాష్ట్రంలో అధికారం వస్తే ఇన్‌కమ్ టాక్స్ రద్దు చేయిస్తామని, కార్మికుల సొంత ఇంటి కల నెరవేరుతుందని, అత్యధిక మెజారిటీతో తనను గెలిపించాలని కోరారు. యూనియన్ ఆర్జీ-1 వైస్ ప్రెసిడెంట్ సదానందం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సెంట్రల్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ నరసింహరెడ్డి, సెంట్రల్ సీనియర్ వైస్‌ప్రెసిడెంట్ ధర్మపురి, నాయకులు పాతిపెల్లి ఎల్లయ్య, రాజయ్య, రాజేశం, ప్రవీణ్, చారి, శ్రీకాంత్ తదితరులున్నారు.

లారీలకు టాక్స్ మాఫీ చేసిన ఘనత సీఎం కేసీఆర్‌దే

- లారీ యాజమానుల సంఘానికి ఎల్లప్పుడూ అండగా నిలిచాం
- రామగుండం ఎమ్మెల్యే, బీఆర్ఎస్ అభ్యర్థి కోరుకంటి చందర్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోరుకంటి చందర్

నవతెలంగాణ-గోదావరిఖని:

రాష్ట్రంలోని లారీలకు టాక్స్‌మాఫీ చేసిన ఘనత సీఎం కేసీఆర్‌దేనని రామగుండం ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి కోరుకంటి చందర్ అన్నారు. లారీ యాజమానుల సంఘానికి తాము ఎల్లప్పుడూ అండగా నిలిచామని, ఎన్నికల్లో లారీ యాజమానుల సంఘం సభ్యులంతా తమకు అండగా నిలిచి రెండోసారి ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. సోమవారం గంగనగర్ స్వాగత్ గార్డెన్స్ లో లారీ యాజమా నుల సంఘం సభ్యులతో జరిగిన ఆత్మీయ సమ్మేళనంలో ఎమ్మెల్యే చందర్, నాయకులు కౌశిక హరి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ ప్రాంతంలోని లారీలకు ఆర్ఎఫ్‌సీఎల్‌లో మెదటగా లోడింగ్ అవకాశం కల్పించామన్నారు. కార్యక్రమంలో రామగుండం నగర మేయర్ డాక్టర్ బంగి అనిల్ కుమార్, రాష్ట్ర నాయకురాలు మూల విజయారెడ్డి, డిప్యూటీ మేయర్ నడిపెల్లి అభిషేక్‌రావు, కార్పొరేటర్లు దాతు శ్రీనివాస్, బాలరాజ్‌కుమార్, లారీ అసోసియేషన్ అధ్యక్షుడు సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్ ప్రజా ఆశీర్వాద సభను

విజయవంతం చేయండి

నవతెలంగాణ -సుల్తానాబాద్ రూరల్

ప్రజలు, కార్యకర్తలు భారీ సంఖ్యలో హాజరై సీఎం కేసీఆర్ ప్రజా ఆశీర్వాద సభను విజయవంతం చేయాలని ఎంపీపీ పొన్నమనేని బాలాజీరావు, మండల అధ్యక్షుడు పురం ప్రేంచందర్‌రావు పిలుపునిచ్చారు. పెద్దపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం నిర్వహించే ప్రజాఆశీర్వాద సభకు సీఎం కేసీఆర్ హాజరై ప్రసంగిస్తారని తెలిపారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక


విద్యార్థులతో ఉపాధ్యాయులు

నవతెలంగాణ, కోల్‌సిటీ:

పెద్దపల్లి జిల్లా టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన పోటీల్లో గోదావరిఖని శ్రీ చైతన్య పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఇషిత్ సోని అండర్-14 విభాగంలో బంగారు పతకం, ఆయుష్ విక్రమ్ సింగ్ మౌర్య, గురువన్ష్‌సింగ్ బగ్గా, స్పర్శవర్మ పలు విభాగాల్లో కాంస్య పతకాలు సాధించారు. విద్యార్థులకు ట్రైనింగ్ ఇచ్చిన పీఈటీ ఉపాధ్యాయులను పాఠశాల అకాడమిక్ ఇన్‌చార్జ్ తేజేశ్వర్‌రావు కొనియాడారు. పీఈటీ శృతి, డీన్ తేజేశ్వరరావు, వైస్ ప్రిన్సిపాల్ నమ్రత, ఏఓ నరేంద్ర కుమార్ ఉపాధ్యాయులు, విద్యార్థులను అభినందించారు.

కరాటేలో చిన్నారులకు మెడల్స్



నవతెలంగాణ, కోల్‌సిటీ

:కరాటే పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి మెడల్స్ సాధించిన చిన్నారులను శ్రీరామ విద్యానికేతన్ యాజమాన్యం అభినందించింది. స్టార్ టైగర్ కరాటే క్లబ్ ఆధ్వర్యంలో తిలక్‌నగర్‌లోని విశ్వం కమ్యూనిటీహాల్లో నిర్వహించిన రాష్ట్రస్థాయి కరాటే ఛాంపియన్‌షిప్ కటాస్ విభాగంలో గాదె విష్ణువర్ధన్ గోల్డ్ మెడల్, భీమారం రోహిత్ సిల్వర్ మెడల్ సాధించారు. శ్రీరామ విద్యానికేతన్ కరస్పాండెంట్ సూర్యదేవర వెంకటేశ్వర్ రావు, ప్రధానోపాధ్యాయురాలు సూర్య దేవర జ్యోతి, ఇతర ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు.

స్కాట్‌లో జిల్లా పేరు నిలబెట్టాలి: ఎంఈవో



నవతెలంగాణ, కోల్‌సిటీ:

భారత స్కౌట్స్ అండ్ గైడ్స్‌లో జిల్లా పేరు నిలబెట్టి, రాష్ట్రపతి అవార్డు సాధించాలని ఎంఈవో సంపత్ రావు అన్నారు. ది భారత్ స్కౌట్స్, గైడ్స్ పెద్దపల్లి జిల్లా అసోసియేషన్ ఆధ్వర్యంలో గోదావరిఖని, శారదానగర్ సరస్వతి శిశుమందిర్‌లో నిర్వహిస్తున్న సోపన్ టెస్టింగ్ క్యాంప్‌లో సోమవారం ఆయన పాల్గొని మాట్లాడారు. జిల్లా స్కౌట్స్, గైడ్స్ సెక్రటరీ జ్యోతి ఆధ్వర్యంలో 67 మంది గైడ్స్‌తో కొనసాగుతున్న ఈ క్యాంపులో ప్రమొదిని, ఎన్.భరతమాత, స్టాఫ్ మెంబెర్స్ వెంకటలక్ష్మీ పలు బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. కార్యక్రమంలో స్కౌట్స్, గైడ్స్ బాధ్యులు సాయి నిరంజన్, జిల్లా స్కౌట్స్ కమిషనర్ రవీందర్, గైడ్‌కెప్టెన్స్ సుందరి, కేజీబీవీ సుల్తానాబాద్, రామగిరి, పాలకుర్తి, ముత్తారం, ఐఎమ్ ఎస్ బసంత్ నగర్, గాయత్రి స్కూల్ పెద్దపల్లి, కరీంనగర్ పారమిత పాఠశాలల నుంచి స్కౌట్, గైడ్ కెప్టెన్లు పాల్గొన్నారు.

కాంగ్రెస్ సంస్థాగత అధ్యక్షుల నియామకం



నియామకమైన నాయకులు

నవతెలంగాణ - హుజురాబాద్

హుజురాబాద్ నియోజకవర్గ పరిధిలోని కాంగ్రెస్ పార్టీ పలు సంస్థగత విభాగాలకు అధ్యక్షులను అధిష్టానం నియమించినట్లు హుజురాబాద్ పట్టణ అధ్యక్షుడు సొల్లు బాబు తెలిపారు. టీపీసీసీ రాష్ట్ర కన్వీనర్‌గా ఇమ్మడి దయాకర్, హుజురాబాద్ నియోజకవర్గ ఎస్సీ సెల్ చైర్మన్‌గా తునికి రవి, మండల కార్యనిర్వాహక అధ్యక్షుడిగా పెరుమాళ్ళ బిక్షపతి, తదితరులను నియమించారు.

కాంగ్రెస్ కాపట ప్రేమను ఓటుతో తిప్పి కొట్టండి

బీఆర్‌ఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి బండ శ్రీనివాస్

నవతెలంగాణ-హుజురాబాద్ టౌన్

కాంగ్రెస్ కాపట ప్రేమను ప్రజలు ఓటుతో తిప్పికొట్టాలని బీఆర్‌ఎస్ పార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శి బండ శ్రీనివాస్ అన్నారు. సోమవారం పట్టణంలో విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. సీఎం కేసీఆర్‌కు అందరు అండగా నిలవాలని కోరారు. సమావేశంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కన్నేబోయిన శ్రీనివాస్ యాదవ్, నాయకులు తులసి లక్ష్మణమూర్తి, తొగరు శివకుమార్, బిఎస్ ఇమ్రాన్, తదితరులున్నారు.



మాట్లాడుతున్న నాయకులు

బీఆర్‌ఎస్‌లో చేరిన ఉద్యమ నాయకుడు చెన్నమల్ల చైతన్య

నవతెలంగాణ - కరీంనగర్

రాజన్న సిరిసిల్ల జిల్లాలోని తెలంగాణ భవన్‌లో బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మున్సిపల్ శాఖ మంత్రి కేటీ రామారావు సమక్షంలో ఉద్యమ నాయకుడు, శాతవాహన యూనివర్సిటీ జేఏసీ (ఫౌండర్) చైర్మెన్ చెన్నమల్ల చైతన్య బీఆర్‌ఎస్‌లో చేరారు. 50 మందికి పైగా విద్యార్థి నాయకులు బీఆర్‌ఎస్‌లో చేరారు.



పార్టీలోకి ఆహ్వానిస్తున్న మంత్రి కేటీఆర్

తెలంగాణ ఉద్యమ సమయంలో మీ బిడ్డగా మీ గౌరవం కాపాడాను

కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పొన్నం ప్రభాకర్

నవతెలంగాణ - సైదాపూర్

'తెలంగాణ ఉద్యమ సమయంలో మీ బిడ్డగా మీ గౌరవం కాపాడాను.. ఎమ్మెల్యేగా గెలిపిస్తే హుస్నాబాద్ నియోజకవర్గ గౌరవాన్ని నేను కాపాడుతానని' కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పొన్నం ప్రభాకర్ అన్నారు. సోమవారం సైదాపూర్ మండలం నల్లని రామయ్యపల్లె, గొడిశాల, గుజ్జులపల్లె, ఎల్లంపల్లి, రాములపల్లి, ఎలాపోతారం, రామచంద్రపూర్ గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. జిల్లా ఉపాధ్యక్షుడు రాఘవులు, మండల అధ్యక్షుడు దోంత సుధాకర్, నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పొన్నం ప్రభాకర్

ఉచిత శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానం

నవతెలంగాణ - తిమ్మాపూర్

ఎస్బీఐ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో నవంబర్ 14నుండి బ్యూటీ పార్లర్ మేనేజ్మెంట్ 30రోజుల ఉచిత శిక్షణ ప్రారంభమవుతుందని సంస్థ డైరెక్టర్ డి.సంపత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల స్త్రీ అభ్యర్థుల నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు చెప్పారు. అభ్యర్థులు ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన వారై ఉండాలని, శిక్షణ కాలంలో ఉచిత భోజన సదుపాయంతో పాటు ఉచిత హాస్టల్ వసతి ఉంటుందని చెప్పారు. పూర్తి వివరాలకు సెల్ 9949448157, 9849411002 నెంబర్లలో సంప్రదించాలని సూచించారు.

ఉచిత కంటి పరీక్షలు

నవతెలంగాణ - కరీంనగర్

నగరంలోని ఓ ప్రయివేటు ఫంక్షన్ హాల్‌లో టాటా ఏఐఏ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీ వారు, శరత్ మాక్స్ విజన్ ఐ హాస్పిటల్ వారు సంయుక్తంగా కంటి చూపు సమస్యలు ఉన్న వారికి సోమవారం పరీక్షలు నిర్వహించారు. కంపెనీ మేనేజర్ రామకృష్ణారెడ్డి, అసిస్టెంట్ మేనేజర్లు వీరస్వామి, సుమలత, ఆదర్శ్, ట్రైనర్ వర్మ, అకౌంటెంట్ మహేందర్, లీడర్లు, ఏజెంట్లు, హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.



కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

రక్తంతో కౌశిక్ రెడ్డి చిత్రాన్ని గీసిన అభిమాని

నవతెలంగాణ - హుజురాబాద్

ఆపదలో తనను ఆదుకున్న తన అభిమాన నాయకుడు పాడి కౌశిక్ రెడ్డికి రక్తంతో ఆయన చిత్రపటం గీసిన వీణవంక మండల కేంద్రానికి చెందిన రేణిగుంట్ల ఠాగూర్ తన అభిమానాన్ని చాటుకున్నాడు. ఎన్నికల్లో విజయం సాధించాలని ఆకాంక్షిస్తూ ఠాగూర్ రక్తంతో కౌశిక్ రెడ్డి చిత్రపటాన్ని గీసి సోమవారం హుజరాబాద్‌లో అందించారు.



చిత్రాన్ని అందజేస్తున్న అభిమాని

కాంగ్రెస్ పార్టీ ప్రచారం

నవతెలంగాణ - హుజురాబాద్

మున్సిపాలిటీ పరిధిలోని 13వ వార్డు ఇందిరా నగర్ కాలనీలో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ అభ్యర్థి వొడితల ప్రణవ్ బాబు తల్లి పద్మశ్రీ ఆరు గ్యారెంటీలను ప్రజలకు వివరించారు. కాంగ్రెస్ పార్టీ చేయి గుర్తుపై ఓటు వేయాలని కోరారు. హుజరాబాద్ పట్టణ అధ్యక్షుడు సొల్లు బాబు, పట్టణ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు వేముల పుష్పలత, జిల్లా ఉపాధ్యక్షురాలు సుశీల, ఎర్ర రవి, తిరుపతి, శ్రీనివాస్ గౌడ్, సునిత పాల్గొన్నారు.



ప్రచారం నిర్వహిస్తున్న ప్రణవ్ బాబు తల్లి పద్మశ్రీ

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

నవతెలంగాణ - వీణవంక

ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని వీణవంక పీఏసీఎస్ సీఈవో ప్రకాష్‌రెడ్డి సూచించారు. మండలంలోని బేతిగల్, పోతిరెడ్డిపల్లి, రెడ్డిపల్లితో పాటు పలు గ్రామాల్లో ఆయన పీఏసీఎస్ సిబ్బందితో కలిసి సోమవారం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు.



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న సీఈవో

కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యం

- చొప్పదండి అభ్యర్థి మేడిపల్లి సత్యం

నవతెలంగాణ - గంగాధర

కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యమని చొప్పదండి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మేడిపల్లి సత్యం అన్నారు. తెలుగుదేశం పార్టీ చొప్పదండి నియోజకవర్గం అధ్యక్షుడు జంగం అంజయ్య, రామడుగు మండల అధ్యక్షుడు అమీరిశెట్టి సుధాకర్ తన అనుచరులతో కలిసి సత్యం ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరగా గంగాధరలోని కార్యాలయంలో కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా సత్యం మాట్లాడారు. రెండుసార్లు ఓడిపోయినా చొప్పదండి నియోజకవర్గంలోనే ఉంటూ ప్రజా సమస్యలపై పోరాటం చేసిన తనకు ఒక్కసారి అవకాశం ఇస్తే అభివృద్ధి అంటే ఏమిటో చూపిస్తానని అన్నారు.



వివిధ పార్టీల నాయకులకు కండువాలు కప్పిన సత్యం

కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా పోలు రాము

నవతెలంగాణ - తిమ్మాపూర్

కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా తిమ్మాపూర్ మండల కేంద్రానికి చెందిన పోలు రామును నియమించినట్లు జిల్లా అధ్యక్షుడు, మానకొండూరు నియోజకవర్గం కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం నియామక పత్రాన్ని అందజేశారు.



నియామకపత్రం అందజేస్తున్న కవ్వంపల్లి

కాంగ్రెస్‌లో చేరిన మాజీ సర్పంచ్ రాజయ్య

నవతెలంగాణ - గన్నేరువరం

మండల కేంద్రానికి చెందిన మాజీ సర్పంచ్ కవ్వంపల్లి రాజయ్య, రామంచ కొమురయ్య, మునిందర్, బట్టు దుర్గయ్య, వేదిరే అనిల్, బట్టు శ్రీకాంత్, 50 మంది కాంగ్రెస్ అభ్యర్థి కవ్వంపల్లి సత్యనారాయణ ఆధ్వర్యంలో పార్టీలో సోమవారం చేరారు. జిల్లా ప్రధాన కార్యదర్శి చిట్కూరి అనంతరెడ్డి, మండల అధ్యక్షుడు ముసుకు ఉపేందర్‌రెడ్డి, అల్లూరి శ్రీనాథ్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



పార్టీలో చేరిన నాయకులు

హుజురాబాద్‌లో ఐదు నామినేషన్లు

నవతెలంగాణ-హుజురాబాద్

హుజురాబాద్ శాసనసభ నియోజకవర్గానికి సోమవారం ఐదు నామినేషన్లు దాఖలైనట్లు హుజురాబాద్ రిటర్నింగ్ అధికారి ఎస్.రాజు తెలిపారు. శనిగరపు రమేష్ బాబు ,బలి రాజా పార్టీ అభ్యర్థిగా, జక్కే వీరస్వామిగౌడ్, ఎంసిపిఐ (యునైటెడ్)అభ్యర్థిగా నామినేషన్ వేయగా, స్వతంత్ర అభ్యర్థులుగా రాపోలు రామ్ కుమార్ భరద్వాజ్, బరిగే గట్టయ్య యాదవ్, బండి శ్రీనివాస్ నామినేషన్లు వేసినట్లు తెలిపారు.



నామినేషన్ వేస్తున్న స్వతంత్ర అభ్యర్థి గట్టయ్య యాదవ్

కాంగ్రెస్ మండల కోశాధికారిగా సంపత్‌రెడ్డి

నవతెలంగాణ - జమ్మికుంట

కాంగ్రెస్ పార్టీ జమ్మికుంట మండల కోశాధికారిగా మాచనపల్లి గ్రామానికి చెందిన గుర్రపు సంపత్‌రెడ్డిని నియమితులయ్యారు. కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు కవ్వంపెల్లి సత్యనారాయణ, మండల అధ్యక్షుడు రాజేశ్వరావు ఉత్తర్వులు అందజేశారు.

ఆర్యవైశ్యులకు అండగా ఉంటా

బీఆర్‌ఎస్ అభ్యర్థి పాడి కౌశిక్‌రెడ్డి

నవతెలంగాణ - జమ్మికుంట

ఆర్యవైశ్యులకు అన్ని విషయాలలో అండగా ఉండి సమస్యలు పరిష్కరిస్తానని హుజురాబాద్ బీఆర్‌ఎస్ అభ్యర్థి పాడి కౌశిక్‌రెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని వర్తక సంఘంలో నిర్వహించిన ఆర్యవైశ్య ఆత్మీయ సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ తక్కలపల్లి రాజేశ్వరరావు, ఆర్యవైశ్య సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు చందరాజు, డివిజన్ అధ్యక్షుడు ఎలిమినేటి రాజేంద్రప్రసాద్, బచ్చు మాధవి, రావికంటి రాజు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ కౌశిక్ రెడ్డి

బూత్ కమిటీల ఏర్పాటు

నవతెలంగాణ-సైదాపూర్

హుస్నాబాద్ నియోజకవర్గంలోని సైదాపూర్ మండలంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు సోమారపు రాజయ్య అధ్యక్షతన సమావేశం నిర్వహించి బూత్ కమిటీలను ఏర్పాటు చేశారు. హనుమకొండ జిల్లా పరిషత్ చైర్మన్ డాక్టర్ సుధీర్ కుమార్, యువ నాయకుడు వొడితల ఇంద్రనీల్ నాయకులకు దిశానిర్దేశం చేశారు. ఎంపీపీ ప్రభాకర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ శ్రీధర్‌రెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షుడు కొత్త తిరుపతిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఇంద్రనీల్

ఆర్డినో అంశంపై గెస్ట్ లెక్చర్

నవతెలంగాణ - తిమ్మాపూర్

మండలంలో రామకృష్ణ కాలనీలోని వాగేశ్వరి ఇంజనీరింగ్ కళాశాలలో ఈసీఈ డిపార్ట్మెంట్ ఆధ్వర్యంలో ఇన్నోవేషన్ యూజింగ్ ఆర్డినో అనే అంశంపై గెస్ట్ లెక్చర్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సెన్సార్ మల్లేశం హాజరై మాట్లాడారు. ఆర్డీనో ప్రాముఖ్యతను వివరిస్తూ వివిధ రకాల సెన్సార్, డీసీ మోటార్స్, ఎల్సిడి ఓస్ ప్లే, ఒజ్జర్ పరికరాలను ఎలా అనుసంధానం చేయాలో వివరించారు. కార్యక్రమంలో కళాశాల జనరల్ సెక్రెటరీ డాక్టర్ గంద్ర శ్రీనివాస్‌రెడ్డి, జాయింట్ సెక్రెటరీ డాక్టర్ శ్రీనివాసరెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాస్, ఈసీ విభాగాధిపతి డాక్టర్ వెంకటారెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మల్లేశం

మా కాలనీని పట్టించుకోవడంలేదు

- 31వ డివిజన్ ఎస్టీ కాలనీవాసులు

నవతెలంగాణ - కరీంనగర్

కరీంనగర్‌లోని 31డివిజన్ కోతిరాంపూర్‌లోని ఎస్టీ కాలనీలో పలు సమస్యలు ఉన్నా స్థానిక కార్పొరేటర్ పట్టించుకోవడం లేదని ఆ కాలనీవాసులు ఆరోపించారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు మాట్లాడుతూ నాలుగేండ్లుగా తమ కాలనీలో రోడ్డు ర్యాంపు రిపేర్‌కు వచ్చిందిన్నారు. ఈ దారి నుంచి వేళ్లే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని కార్పొరేటర్‌కు, అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోకపోవడంతో చేసేదేమిలేక కాలనీవాసుల తమ సోంత డబ్బులతో తల రూ.100 వేసుకోని మరమ్మతు చేసుకున్నట్టు తెలిపారు. స్థానక డివిజన్‌లోని సమస్యలను తెలుసుకోని ప్రజాప్రతినిదులు, అధికారులు పరిష్కరించాలని కోరారు. మరమ్మత్తులు చేసుకున్నవారు ఎస్ఎంపి కిరాణాం దారుడు నవాజ్, విజేందర్‌రెడ్డి, మొగిలి వెంకటేష్, కోనేటి శ్రీనివాస్, కేమసారం తిరుపతి, సత్యనారాయణ ఉన్నారు.

సొంత గూటికి చేరిన ఎంపీపీ మమత

నవతెలంగాణ - జమ్మికుంట

ఈ నెల 5న కాంగ్రెస్ పార్టీలో చేరిన జమ్మికుంట ఎంపీపీ మమత తిరిగి బీఆర్‌ఎస్‌లో సోమవారం చేరారు. 24గంటలు గడవకముందే తిరిగి కాంగ్రెస్ పార్టీ నుండి బీఆర్‌ఎస్ పార్టీలో ప్రభుత్వ విప్ పాడి కౌశిక్ రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్ కుమార్ సమక్షంలో చేరారు.

c m y k